విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్దత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
99492 22450
ప్రభాత సూర్య
www.suryaa.news

ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
29-3-2026
వెల : రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 1
సంచిక : 207

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# అనుమతుల్లేకుండా రాఘవ మైనింగ్





- హైదరాబాద్‌లో అక్రమ తవ్వకాలపై హరీశ్‌రావు ఆరోపణలు
- మంత్రిపై నేరుగా విమర్శలు.. విచారణకు డిమాండ్
- బీఆర్ఎస్ సభ్యుల ఆందోళనతో సభలో గందరగోళం
- జీవోలకు విరుద్ధంగా స్టోన్ క్రషర్ నడుపుతున్నారన్న ఆరోపణలు
- తనిఖీల్లో భారీగా రఫ్ స్టోన్ స్వాధీనం
- రెండుసార్లు పట్టుబడ్డా చర్యలేవీ లేవన్న విమర్శలు
- ప్రభుత్వంపై ద్వంద్వ వైఖరి ఆరోపణలు
- మంత్రుల అభ్యంతరాలు.. స్పీకర్ జోక్యంతో పరిస్థితి సద్దుమణుగు

హైదరాబాద్, మార్చి 29: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ అనుమతుల్లేకుండానే మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై సభా సంఘం ఏర్పాటు చేయాలని లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పూర్తి స్థాయి విచారణకు ముందు మంత్రి తన పదవికి రాజీనామా చేసి విచారణను ఎదుర్కోవాలని పట్టుబట్టారు. హరీశ్‌రావు ఆరోపణలకు మద్దతుగా బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీ వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. తప్పు చేయనట్లయితే భయపడాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నిస్తూ సభలో ఉద్రిక్తత సృష్టించారు. కొంతసేపు సభా కార్యక్రమాలు అస్తవ్యస్తమయ్యాయి.

బడ్జెట్ చర్చల సందర్భంగా గనుల శాఖపై జరిగిన చర్చలో హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఖనిజ సంపదను కాపాడాల్సిన వారు దానిని దోచుకుంటున్నారని విమర్శించారు. కోత్వాల్‌గూడ ప్రాంతంలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జీవో 111 ప్రకారం ఆ ప్రాంతంలో కాలుష్య పరిశ్రమలు అనుమతించరాదని ఉన్నప్పటికీ, అక్కడ భారీ స్టోన్ క్రషర్‌ను నడుపుతున్నారని ఆరోపించారు. జీవో 26 ప్రకారం స్టోన్ క్రషర్ ఏర్పాటు చేయాలంటే మినరల్ డీలర్ లైసెన్స్, పరిశ్రమల శాఖ అనుమతి, కాలుష్య నియంత్రణ మండలి నుంచి అవసరమైన సర్టిఫికెట్లు ఉండాలని చెప్పారు. అయితే ఈ సంస్థ విద్యుత్ కనెక్షన్ లేకుండా డీజిల్ జనరేటర్లతో కార్యకలాపాలు కొనసాగిస్తోందని ఆరోపించారు. 2025 మే 21న మైనింగ్ డైరెక్టర్ జనరల్ ఆదేశాలతో

(మిగతా 2వ పేజీలో)

# మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ దర్యాప్తు



- విపక్షంపై సీఎం తీవ్ర విమర్శలు.. అసెంబ్లీలో ఘాటైన ప్రకటన
- 2014 నుంచి అన్ని మైనింగ్ లీజులపై సమగ్ర విచారణకు ఆదేశాలు
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌తో పాటు ఆరు సంస్థలు స్కానర్‌లోకి
- వచ్చే సమావేశాల్లో నివేదిక.. తప్పిదాలపై కఠిన చర్యలు
- ఇసుక మాఫియాపై గత ప్రభుత్వానిదే బాధ్యత అంటూ ఆరోపణలు
- ప్రభుత్వ ఆదాయం పెంచామన్న సీఎం.. గణాంకాలతో వివరణ
- బీఆర్ఎస్ బ్లాక్‌మెయిలింగ్ చేస్తోందని మండిపాటు
- రాఘవ సంస్థపై ఇప్పటికే జరిమానాలు వసూలు చేశామన్న స్పష్టం

హైదరాబాద్, మార్చి 29: రాష్ట్రంలో అక్రమ మైనింగ్ అంశంపై విపక్ష బీఆర్ఎస్ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. అయితే ఇలాంటి ఒత్తిళ్లకు తమ ప్రభుత్వం ఏమాత్రం భయపడదని స్పష్టం చేశారు. తెలంగాణ ఆవిర్భావం అయిన 2014 జూన్ 2 నుంచి ఇప్పటి వరకు ఇచ్చిన అన్ని మైనింగ్ లీజులు, అక్రమాలపై సీబీసీఐడీతో సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశిస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్, హరీశ్‌రావు సోదరుడికి సంబంధించిన మైనింగ్ సంస్థతో పాటు మొత్తం ఆరు సంస్థలపై దర్యాప్తు జరుగుతుందని తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోగా ఈ విచారణ పూర్తిచేసి నివేదికను సభ ముందు ఉంచుతామని చెప్పారు. మైనింగ్ అక్రమాల్లో ఎవరూ తప్పించుకోలేరని, ఒక్కొక్కరి విషయాన్ని తేలుస్తామని హెచ్చరించారు. అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భంగా ఈ అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మంత్రి పొంగులేటికి చెందినదని ఆరోపిస్తూ సభాసంఘం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి రాజీనామా చేయాలని కోరుతూ సభ వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ కీలక ప్రకటన చేశారు. గతంలో ఇసుక, మైనింగ్ మాఫియాలకు సంబంధించి భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని సీఎం ఆరోపించారు. హరీశ్‌రావు, కేటీఆర్ పాలనలో వేల కోట్ల రూపాయల ఇసుక మాఫియా నడిచిందని విమర్శించారు. ఆదాయ పంపకాల విషయంలో తేడాల వల్లే అంతర్గత విభేదాలు వచ్చాయని కూడా వ్యాఖ్యానించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని నేరెళ్ల ఘటనను ప్రస్తావిస్తూ గతంలో అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రాణనష్టం జరిగినా సరైన చర్యలు తీసుకోలేదని అన్నారు. అలాగే వివిధ గ్రానైట్ సంస్థలు, మాజీ ప్రజాప్రతినిధులపై కూడా అక్రమ మైనింగ్ ఆరోపణలు చేస్తూ వాటన్నింటిపై విచారణ జరుగుతుందని

(మిగతా 2వ పేజీలో)



## తమిళనాడు ఎన్నికలు డీఎంకే అభ్యర్థుల పూర్తి జాబితా విడుదల

## హర్మూజ్ జలసంధి దాటిన రెండు భారత ఎల్పీజీ నౌకలు










## తల్లీ, ఇద్దరు చిన్నారుల మృతి..

- భర్త మృతితో మానసిక వేదనలో ఉన్న మహిళ
- ఇంట్లో ఉరివేసుకున్న తల్లి.. పక్కనే మృతి చెందిన పిల్లలు
- చిన్నారుల గొంతుపై గాయాలు గుర్తింపు



## ఐక్యతే శక్తి.. సవాళ్లను కలిసి ఎదుర్కోవాలి: మోదీ పిలుపు

- అంతర్జాతీయ పరిస్థితులపై అప్రమత్తత అవసరమన్న ప్రధాని
- బాధ్యతాయుత వ్యాఖ్యలు చేయాలన్న సూచన
- నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు తొలి దశ ప్రారంభం
- 'వికసిత్ భారత్' లక్ష్యానికి 140 కోట్ల ప్రజల భాగస్వామ్యం కీలకం
- సంక్షోభం మధ్య ఐక్యతతో ముందుకు సాగాలన్న సందేశం
- చమురు, గ్యాస్ ధరల ప్రభావం తగ్గించేందుకు చర్యలు
- ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేకంగా సాగిన ప్రారంభోత్సవం
- మొబైల్ ఫ్లాష్‌లైట్లతో పూర్తి చేసిన కార్యక్రమం

నోయిడా/లక్నో, మార్చి 29: అంతర్జాతీయ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలంటే దేశ ప్రజలంతా ఐక్యంగా, అంకితభావంతో ముందుకు సాగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ఉత్తరప్రదేశ్‌లోని

(మిగతా 2వ పేజీలో)

## మూసీ పేరిట భారీ అవినీతి: కేటీఆర్

- రేవంత్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు.. 'శివతాండవం' వ్యాఖ్యలపై ఆగ్రహం
- మూసీ పునరుజ్జీవం పేరుతో రూ.లక్షన్నర కోట్ల స్కామ్ ఆరోపణ
- పేదల ఇళ్ల కూల్చివేత.. కార్పొరేట్‌లకు భూముల అప్పగింత ఆరోపణలు
- బీఆర్ఎస్ ప్రణాళికను పక్కనబెట్టి ఖర్చులు పెంచారన్న విమర్శ
- ఏప్రిల్ మొదటి వారంలో మేధావులతో రౌండ్‌టేబుల్ సమావేశం



హైదరాబాద్, మార్చి 29: మూసీనది పునరుజ్జీవం పేరిట రాష్ట్ర ప్రభుత్వం భారీ అవినీతికి తెరలేపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవుడి పేరును ఉపయోగిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. 'శివతాండవం చేస్తాను' వంటి వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్వీ విస్తృత సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ మూసీ ప్రాజెక్టు ఖర్చులను అనవసరంగా పెంచి రూ.లక్షన్నర కోట్ల అవినీతికి మార్గం సుగమం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్లతో సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం దాన్ని పక్కనబెట్టి భారీ అంచనాలతో ముందుకు సాగుతోందన్నారు. మూసీ ప్రాజెక్టు పేరుతో పేదల లక్షల ఇళ్లను కూల్చివేయడానికి ప్రయత్నిస్తున్నారని, సుమారు 3 వేల ఎకరాల భూమిని కార్పొరేట్ సంస్థలకు

(మిగతా 2వ పేజీలో)



## ఇక అమరావతిని అంగుళం కూడా కదిలించలేరు: సీఎం చంద్రబాబు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతేనని, దీనిని ఎవరూ తాకలేరని, అంగుళం కూడా కదిలించలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత కల్పించడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలనే లక్ష్యంతో, శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. అమరావతిపై గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని, ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యాలను సుదీర్ఘంగా వివరించారు.

**చారిత్రక నేపథ్యం.. తెలుగుజాతి ఆత్మగౌరవం**

అమరావతికి వందల ఏళ్ల చరిత్ర ఉందని, శాతవాహనులు ఇక్కడి నుంచే పాలన సాగించారని చంద్రబాబు గుర్తు చేశారు. బ్రిటిష్ మ్యూజియంలో సైతం అమరావతి గ్యాలరీ ఉండటమే దీని ప్రాశస్త్యానికి నిదర్శనమని అన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగంతో

(మిగతా 2వ పేజీలో)

## అనుమతుల్లేకుండా రాఘవ మైనింగ్

సంయుక్త తనిఖీలు నిర్వహించగా 5,130 మెట్రిక్ టన్నుల అక్రమ రఫ్ స్టోన్ బయటపడిందని తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 13న రూ.24 లక్షల డిమాండ్ నోటీసు జారీ చేసినట్లు చెప్పారు. మార్చి 4న మళ్లీ తనిఖీ చేయగా 11,200 మెట్రిక్ టన్నుల ముడి సరుకు గుర్తించారని, మార్చి 13న మరో షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు వివరించారు. నిబంధనల ప్రకారం లైసెన్స్ లేకుండా క్వారీ నిర్వహిస్తే జరిమానాలు, జైలుశిక్షలు విధించాల్సి ఉంటుందని పేర్కొంటూ, రెండుసార్లు పట్టుబడ్డా కూడా రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం అనుమానాస్పదమని విమర్శించారు. ప్రతిపక్షానికి ఒక విధంగా, అధికార పక్షానికి మరో విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సంబంధం లేని అంశంలో మంత్రి పేరును ప్రస్తావించడం సరికాదని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరగా, ఇతర సభ్యులు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. గత ఘటనలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ సభ్యులు విపక్షాన్ని నిలదీశారు. సభలో వాదప్రతివాదాలు తీవ్ర స్థాయికి చేరుకోవడంతో స్పీకర్ జోక్యం చేసుకుని హరీశ్‌రావు వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం బడ్జెట్ చర్చను కొనసాగించారు. ఈ ఘటనతో అసెంబ్లీలో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు స్పష్టంగా కనిపించాయి.

## మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ దర్యాప్తు

స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక ఆదాయం గణనీయంగా పెరిగిందని సీఎం వివరించారు. 2020--21లో రూ.721 కోట్లు వచ్చిన ఆదాయం 2025--26లో రూ.972 కోట్లకు పెరిగిందని చెప్పారు. ఇది తమ పాలనలో పారదర్శకతకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్మాణ రంగం దెబ్బతిందని చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. బీఆర్ఎస్ నేతలు తమపై బురదజల్లేందుకు, సంబంధిత మంత్రిని బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని సీఎం ఆరోపించారు. వ్యక్తిగత సంబంధాలను రాజకీయంగా మలచి ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేయడం తగదని హెచ్చరించారు. ఇలాంటి చర్యలు ఫలించవని స్పష్టం చేశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుందని సీఎం తెలిపారు. సీనరేజీ చార్జీలుగా రూ.1.52 కోట్లు, పర్మిట్ ఫీజులుగా రూ.1.22 కోట్లు వసూలు చేసినట్లు వెల్లడించారు. ఇది విపక్షం ఫిర్యాదు చేసిన తర్వాత తీసుకున్న చర్య కాదని, ప్రభుత్వమే ముందుగా స్పందించి చర్యలు చేపట్టిందని చెప్పారు. సీఎం ప్రసంగం అనంతరం సభలో చర్చ ముగియగా, ప్యానెల్ స్పీకర్ సభను ఆదివారం ఉదయం వరకు వాయిదా వేశారు. ఈ పరిణామాలతో అసెంబ్లీలో ప్రభుత్వం–విపక్షాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

## మూసీ పేరిట భారీ అవినీతి: కేటీఆర్

అప్పగించే యత్నం జరుగుతోందని ఆరోపించారు. బఫర్ జోన్ పేరుతో పేదల ఇళ్లు మాత్రమే కూల్చడం ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని చూపిస్తోందన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో మేధావులు, పర్యావరణ నిపుణులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి ఈ అంశంపై విస్తృత చర్చ జరిపిస్తామని తెలిపారు. ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి వరకు కాలేజీలు, బస్తీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేస్తామని ప్రకటించారు. అవసరమైతే ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో తాళాలు బద్దలుకొట్టైనా జయంతి వేడుకలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో విద్యార్థులు పర్యటించి ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని బీఆర్ఎస్వీ నాయకులకు సూచించారు. మంత్రి పొంగులేటి మైనింగ్ అక్రమాలను ప్రశ్నించినందుకు ప్రతిపక్ష నాయకులను సీఎం బెదిరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. బెదిరింపులు చేయడం రేవంత్‌రెడ్డికి అలవాటైందని, అయితే బీఆర్ఎస్ అలాంటి ఒత్తిళ్లకు ఎప్పుడూ తలొగ్గదని స్పష్టం చేశారు. మూసీలో మురుగునీటి శుద్ధి కేంద్రాలు దాదాపు పూర్తి చేసి, కాళేశ్వరం నుంచి నీటిని పంపించే ప్రణాళికను తమ ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం పూర్తి స్థాయి డీపీఆర్ కూడా లేకుండానే భారీ ఖర్చులతో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోందని విమర్శించారు. మూసీ ఒడ్డున ఉన్న పేదల ఇళ్లను చట్టవిరుద్ధమని కూల్చివేస్తూ, అదే ప్రాంతంలో భారీ హోటళ్లు, వ్యాపార కేంద్రాలు నిర్మించాలనుకోవడం అన్యాయమని మండిపడ్డారు. పేదల జీవితాలను నాశనం చేస్తూ హైదరాబాద్‌ను విధ్వంసం చేస్తున్నారని, రాష్ట్ర పరిస్థితి 'పిచ్చోడి చేతిలో రాయి'లా మారిందని తీవ్రంగా వ్యాఖ్యానించారు.

## హర్మూజ్ జలసంధి దాటిన రెండు భారత ఎల్పీజీ నౌకలు

భారతీయ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ కంటైనర్లు బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్‌లు హర్మూజ్ జలసంధిని దాటాయి. శక్రవారం నాడు దుబాయ్ రస్‌అల్‌ఖైమాకు ఉత్తరాన లంగర్ వేసిన ఐదు నౌకలలో ఇవి కూడా ఉన్నాయి. ఈఎల్ఎం నౌక హెచ్‌పీసీఎల్‌ది కాగా, టీవైఆర్ నౌక బీపీసీఎల్‌కు చెందినది. భారత్ సహా మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎల్పీజీని తీసుకువస్తున్న రెండు నౌకలు సురక్షితంగా హర్మూజ్‌ను దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు నౌకల్లో 90,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ గ్యాస్ వస్తోంది. ఈ రెండు నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరికొన్ని భారతీయ ట్యాంకర్లు యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ సమీపంలోని జలాల్లో ఇరాన్ అనుమతి కోసం వేచి చూస్తున్నాయి. కాగా, 47,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్‌తో కూడిన జగ్ వసంత్ ట్యాంకర్ నౌక గుజరాత్‌లోని వదినార్ పోర్టుకు చేరుకుంది.

## ఉద్యోగాల కేంద్రంగా జేవార్ ఎయిర్‌పోర్ట్: కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం ఉత్తరప్రదేశ్‌కే కాకుండా యావత్ దేశానికి ఉద్యోగ, పెట్టుబడుల, ఆర్థిక వృద్ధి కేంద్రంగా మారుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ సమక్షంలో ఆయన ప్రసంగించారు. జేవార్‌లో ఈ విమానాశ్రయం ప్రారంభం కావడం దేశానికే గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కొత్త విమానాశ్రయంతో దేశ రాజధాని ప్రాంతానికి మరో గుండెచప్పుడు లాంటిదని ఆయన అభివర్ణించారు. తొలి దశలో దాదాపు రూ.11,200 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసినట్టు తెలిపారు. అంతర్జాతీయ కార్యకలాపాలు నిర్వహించగల సామర్థ్యంతో నాలుగు కిలోమీటర్ల పొడవైన రన్‌వేను నిర్మించినట్టు వివరించారు. ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా, అభివృద్ధికి వారసత్వాన్ని జోడిస్తూ ఉత్తరప్రదేశ్ సాంస్కృతిక గుర్తింపును ఈ ఎయిర్‌పోర్ట్ టర్మినల్ ప్రతిబింబిస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టును కార్గో మౌలిక వసతులతో కూడిన సమీకృత 'ఏరోట్రోపోలిస్'గా తీర్చిదిద్దుతున్నామని, దీనివల్ల స్థానికంగా తయారైన వస్తువులు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు సులభంగా చేరుకుంటాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు. 40 ఎకరాల్లో ఏర్పాటు కానున్న మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్ హాలింగ్ కేంద్రం స్థానిక యువతకు విమానయాన రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. "గతంలో జేవార్, సమీప ప్రాంతాల ప్రజలు ఉద్యోగాల కోసం ఢిల్లీ వెళ్లేవారు. ఇప్పుడు దేశ విదేశాల నుంచి ప్రజలు ఉద్యోగాల కోసం జేవార్‌కు వస్తారు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గ్రౌండ్ హ్యాండ్లింగ్, కార్గో, హాస్పిటాలిటీ, లాజిస్టిక్స్ వంటి అనేక రంగాల్లో అవకాశాలు లభిస్తాయని చెప్పారు. 'ఉడాన్' వంటి పథకాలతో సామాన్యులకు విమాన ప్రయాణం అందుబాటులోకి వచ్చిందని, ఈ వృద్ధి భవిష్యత్తులోనూ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

# ఐక్యతే శక్తి.. సవాళ్లను కలిసి ఎదుర్కోవాలి: మోదీ

జేవర్‌లో నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు తొలి దశను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సభలో మోదీ ప్రసంగించారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఐక్యత, సహకారం అవసరమని తెలిపారు. సమయాన్ని ఆదా చేయడం, ఖర్చులను తగ్గించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను ప్రస్తావిస్తూ, ఈ సంక్షోభాన్ని ప్రశాంతంగా, సహనంతో ఎదుర్కోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమయంలో దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, అదే మన బలమని అన్నారు. పశ్చిమాసియా పరిణామాలపై పార్లమెంట్‌లో చర్చలు జరిపినట్లు, ముఖ్యమంత్రులతో కూడా విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి సమయంలో రాజకీయ పార్టీలు బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేయకుండా ఉండాలని సూచించారు. కోవిడ్ సమయంలో తప్పుడు ప్రచారం చేసిన వారిని ప్రజలు తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో చమురు, గ్యాస్ ధరల భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని మోదీ తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం తగ్గించేందుకు సమగ్ర చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. వేలాది మంది ప్రజల సమక్షంలో మోదీ సభను ఉద్దేశించి మాట్లాడారు. 'భారత్ మాతాకీ జై' నినాదాలతో సభ మార్మోగింది. కార్యక్రమం పూర్తయ్యిందా అని మోదీ ప్రశ్నించగా, ప్రజలు అవునని సమాధానమిచ్చారు. అయితే ఇంకా పూర్తికాలేదని, ప్రజలే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచిస్తూ తమ మొబైల్



ఫోన్లలో ఫ్లాష్‌లైట్లను ఆన్ చేయాలని కోరారు. వెంటనే జనసందోహం అంతా ఫ్లాష్‌లైట్లు వెలిగించడంతో అద్భుత దృశ్యం ఏర్పడింది. ఆ తరువాత కార్యక్రమం పూర్తయిందని ప్రకటించడంతో సభ హర్షధ్వానాలతో మార్మోగింది.

## తమిళనాడు ఎన్నికలు: డీఎంకే అభ్యర్థుల పూర్తి జాబితా విడుదల

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో, అధికార ద్రావిడ మున్నేట్ర కజగం (డీఎంకే) తమ అభ్యర్థుల పూర్తి జాబితాను ప్రకటించి ఎన్నికల సమరానికి సర్వసన్నద్ధమైంది. రాష్ట్రంలో ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుండగా, మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. శుక్రవారం విడుదల చేసిన ఈ జాబితా ప్రకారం, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన సిట్టింగ్ స్థానమైన కోలత్తూరు నుంచే మరోసారి పోటీ చేయనున్నారు. ఆయన కుమారుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చెన్నైలోని చేపాక్–ట్రిప్లికేన్ నుంచి తిరిగి బరిలోకి దిగుతున్నారు. ఈ ఎన్నికల్లో కీలక రాజకీయ పరిణామంగా, ఏఐఏడీఎంకే నుంచి బహిష్కరణకు గురై డీఎంకే కూటమితో చేతులు కలిపిన సీనియర్ నేత ఓ. పన్నీర్‌సెల్వం తేని జిల్లాలోని బోడినాయకనూర్ నుంచి పోటీ చేయనున్నారు. గతంలో ఆయన ఈ నియోజకవర్గం నుంచి పలుమార్లు గెలుపొందారు. మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు గాను డీఎంకే 164 చోట్ల పోటీ చేస్తుండగా, మిగిలిన 70 సీట్లను మిత్రపక్షాలకు కేటాయించింది. పార్టీ సీనియర్లు, మంత్రులైన దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేశ్, సెంథిల్ బాలాజీ వంటి చాలా మందికి వారి సిట్టింగ్ స్థానాలనే మళ్లీ కేటాయించారు. అయితే, పొత్తులో భాగంగా మంత్రి మనో తంగరాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పద్మనాభపురం సీటును కాంగ్రెస్ పార్టీకి ఇచ్చారు. ఈసారి ఎన్నికలు డీఎంకే కూటమి, ఏఐఏడీఎంకే–ఎన్డీఏ కూటమి, నటుడు విజయ్ స్థాపించిన



తమిళగ వెట్రి కజగం (టీవీకే), నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) మధ్య చతుర్ముఖ పోటీకి వేదిక కానున్నాయి. తాజా జాబితా విడుదలతో డీఎంకే ఎన్నికల ప్రచారాన్ని మరింత ముమ్మరం చేసేందుకు సిద్ధమైంది.

# తల్లీ, ఇద్దరు చిన్నారుల మృతి..

### భర్త మృతితో మానసిక వేదనలో ఉన్న మహిళ

### ఇంట్లో ఉరివేసుకున్న తల్లి.. పక్కనే మృతి చెందిన పిల్లలు


### చిన్నారుల గొంతుపై గాయాలు గుర్తింపు





కంది (సంగారెడ్డి), మార్చి 29: సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని జుల్కల్ గ్రామంలో తల్లీ, ఇద్దరు చిన్నారులు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. పోలీసుల వివరాల ప్రకారం, జుల్కల్ గ్రామానికి చెందిన పట్నం ప్రవీణ్ (30)కు అల్లూరుకు చెందిన మమత (27)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి మణికంఠ (5), ప్రళయశ్రీ (2) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఈ ఏడాది జనవరి 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్ మృతి చెందడంతో కుటుంబంపై తీవ్ర దెబ్బపడింది. భర్త మరణంతో పిల్లల పోషణ బాధ్యత మొత్తం మమతపై పడింది. ఈ సంఘటన తర్వాత ఆమె తీవ్ర మానసిక ఆవేదనకు లోనైనట్లు స్థానికులు తెలిపారు. అప్పటి నుంచి ఆమె మానసికంగా కుంగిపోయి ఉండేదని చెబుతున్నారు. శనివారం మధ్యాహ్నం సమయంలో మమత ఇంటి తలుపులు మూసి ఉండటంతోపాటు, పిలిచినా స్పందించకపోవడంతో పొరుగువారికి అనుమానం వచ్చింది. వెంటనే వారు తలుపులు బలవంతంగా తెరిచి లోపలికి వెళ్లి చూడగా విషాద దృశ్యం కనిపించింది. ఇంట్లో మమత చీరతో ఉరివేసుకుని మృతి చెందిన స్థితిలో కనిపించగా, పక్కనే ఇద్దరు చిన్నారులు విగతజీవులుగా పడి ఉన్నారు. చిన్నారుల గొంతు భాగాల్లో గాయాలు ఉండటంతో ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాథమికంగా, భర్త మరణంతో కలిగిన మానసిక వేదనతో మమత ముందుగా తన పిల్లలను గొంతు నులిమి చంపి, అనంతరం తాను ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెలుగులోకి రానున్నాయి. సమాచారం అందుకున్న ఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీ సత్యయ్య గౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాలను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఒకే కుటుంబంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

# ఇక అమరావతిని అంగుళం కూడా కదిలించలేరు: సీఎం చంద్రబాబు



ఏర్పడిన ఆంధ్రరాష్ట్రానికి అప్పుడే విజయవాడను రాజధాని చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు తెలుగువారిని 'మదరాసీలు' అని పిలిచేవారని, ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని తెలిపారు. పీవీ నరసింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అందిపుచ్చుకుని తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా రాణించారని, తాను సైబరాబాద్ నిర్మించడం వల్లే నేడు తెలంగాణ ఆదాయంలో హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు.

### మూడు రాజధానుల కుట్ర.. జగన్‌పై చంద్రబాబు ఫైర్

ఎన్నికలకు ముందు అమరావతికి జై కొట్టిన జగన్ మోహన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మాట మార్చి మూడు రాజధానుల నాటకానికి తెరలేపారని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. 'ఒక్క ఛాన్స్' పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని ఆరోపించారు. ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలన మొదలుపెట్టారని, అమరావతిని శ్మశానం, ఎడారి, ముంపు ప్రాంతం, వేశ్యల రాజధాని అంటూ దుష్ప్రచారం చేసి ప్రజల్లో విషం నింపారని మండిపడ్డారు. మూడు రాజధానుల బిల్లును శాసన మండలి తిరస్కరించి సెలెక్ట్ కమిటీకి పంపితే, నిబంధనలకు విరుద్ధంగా గవర్నర్‌కు పంపి చట్టం చేయాలని చూశారని, కానీ హైకోర్టు జోక్యంతో రాజధానిని కాపాడుకోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు.

### రైతుల త్యాగం.. 1631 రోజుల పోరాటం

రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని శాంతియుతంగా ప్రభుత్వానికి ఇచ్చారని, ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి ల్యాండ్ పూలింగ్ జరగలేదని చంద్రబాబు అన్నారు. అలాంటి రైతులపై గత ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని, అక్రమ కేసులు బనాయించి, మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చి, కాళ్లతో తన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు 1,631 రోజుల పాటు చారిత్రాత్మక పోరాటం చేశారని, 'న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు' పాదయాత్రతో తమ ఆవేదనను తెలియజేశారని కొనియాడారు. వైసీపీ అమరావతికి, ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిందని, అందుకే ప్రజలు 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేశారని వ్యాఖ్యానించారు.

### 2028 నాటికి అమరావతి పూర్తి.. పనుల పునఃప్రారంభం

ప్రజాతీర్పుతో రాష్ట్రానికి మళ్లీ మంచి రోజులు ప్రారంభమయ్యాయని చంద్రబాబు అన్నారు. అమరావతి పనులు ఇప్పటికే పునఃప్రారంభమయ్యాయని, దాదాపు రూ.56 వేల కోట్ల విలువైన 91 పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. 2028 నాటికి అమరావతిలో ప్రధాన నిర్మాణాలు పూర్తి చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ట్రంక్ రోడ్లు 2027 మే నాటికి, అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్లు 2028 ఆగస్టు నాటికి పూర్తి చేసి ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని వెల్లడించారు. శంకుస్థాపన చేసిన నగరంలో పనులు ఆగిపోయి, మళ్లీ పునఃప్రారంభించడం చరిత్రలో అమరావతిలోనే జరిగిందని అన్నారు.

### విధ్వంసకారులకు హెచ్చరిక.. మూడు ప్రాంతాల అభివృద్ధికి హామీ

అమరావతి పనులు వేగవంతం అవుతున్న తరుణంలో ఇటీవల వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనలపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేశామని, అమరావతిలో ఎవరైనా విధ్వంసానికి పాల్పడాలని చూస్తే అది వారికి చివరి రోజవుతుందని గట్టిగా హెచ్చరించారు. తమ ప్రభుత్వ విధానం 'ఒకే రాజధాని – అన్ని ప్రాంతాల అభివృద్ధి' అని పునరుద్ఘాటించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి రీజియన్లను మెగా నగరాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. విశాఖలో డేటా సెంటర్, అనకాపల్లిలో స్టీల్ సిటీ, రామాయపట్నం పోర్టు వంటి ప్రాజెక్టులతో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# ప్రజాపాలన, 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న యాదాద్రి ఫైర్ స్టేషన్ పోలీస్ అధికారులు





తుర్కపల్లి మార్చ్ 28 ప్రభాత సూర్య: తుర్కపల్లి మండలంలోని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ రోజు యాదాద్రి (యాదగిరిగుట్ట)ఫైర్ స్టేషన్ పోలీస్ అధికారులు వచ్చి తుర్కపల్లిలోని కరుణా నర్సింగ్ హోమ్ లో ఏర్పాటుచేసి, బి.మధుసుదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఫైర్ సిలిండర్ ఎలా ఉపయోగించాలి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రమాదాలనుండి ఎలా తప్పించుకోవాలని మధుసుధన్ రెడ్డి,సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫైర్ పోలీసులు వి.పాండు, జి.రవి,కె. వినయ్, ఎల్ నరేందర్, మరియు కరుణా నర్సింగ్ హోమ్ ,సూర్య పత్రిక యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ లయన్ ఎ చెన్న కిష్టయ్య ,హాస్పిటల్ స్టాఫ్ బి.హరిబాబు ప్రజాపతి,తూటి అశోక్,బి. సంతోష్, భార్గవి, వాణి, శ్రావణి, నవ్య తదితరులు పాల్గొన్నారు

# హనుమాన్ సేవ ఊరేగింపులో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్





పటాన్చెరు, మార్చి 28,ప్రభాత సూర్య : మండలం లోని శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన హనుమాన్ సేవ ఊరేగింపు కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తో కలిసి బీఆర్ఎస్ నాయకులు , ఎం. డి. ఆర్.ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ ఊరేగింపులో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు స్వీకరించారు. భక్తులు జై శ్రీరామ్ నినాదాలతో ఊరేగింపును భక్తిశ్రద్ధలతో కొనసాగించగా, సంప్రదాయ వాద్యగోష్ఠులు, అలంకరించిన హనుమాన్ స్వామి విగ్రహం ఊరేగింపుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, గూడెం మధు, ఎట్టయ్య, విజయ్, అశోక్ , విక్రమ్ మరియు అన్నదాన కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువత , భక్తులు మరియు, ఎం. పి. ఆర్.యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పటాన్చెరు ఏపీఆర్ లో నిర్మిస్తున్న శ్రీ విశాలక్ష్మీ సమేత కాశీ విశ్వనాథ స్వామి, శ్రీ సీతీ సమేత కోదండ రామచంద్రస్వామి ఆలయానికి 75 లక్షల భారీ విరాళం

## నేటి వరకు సొంత నిధులతో 210 కు పైగా దేవాలయాల నిర్మాణం

## ప్రతి ఒక్కరిలో భక్తి భావం , మతసామరస్యాన్ని పెంపొందించడమే మా లక్ష్యం : ఎమ్మెల్యే జిఎంఆర్





పటాన్చెరు, మార్చి 28,ప్రభాత సూర్య : మండలం లోని ఒక వైపు అభివృద్ధిలో మరో వైపు ఆధ్యాత్మికలో పటాన్చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రతీకగా నిలుపుతూ నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తున్నారు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా గుడి, మసీదు, చర్చి నిర్మిస్తే తన వంతు సహకారాన్ని అందిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని పెంపొందిస్తున్నారు. తాజాగా..పటాన్చెరు ఏపీఆర్ లో నిర్మిస్తున్న శ్రీ విశాలక్ష్మీ సమేత కాశీ విశ్వనాథ స్వామి, శ్రీ సీతా సమేత కోదండ రామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి 75 లక్షల రూపాయల భారీ విరాళం అందించారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు 75 లక్షల రూపాయల విరాళానికి సంబంధించిన చెక్కులను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మతాలు వేరైనా మనుషులందరూ ఒక్కటేనని.. మానవత్వం, ప్రేమ, శాంతి, మరియు సోదరభావం మతాల మూల సూత్రమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ధర్మాన్ని కాపాడుకుంటూ.. పరమత సహనాన్ని పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే గత 20 సంవత్సరాలుగా పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో 210 కి పైగా దేవాలయాలు, వందకు పైనా మసీదులు, ఆశిర్ఖానాలు, 30 కి పైగా చర్చిలు నిర్మించి పరమత సహనానికి ప్రతీకగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు.. దైవం పట్ల అచంచల విశ్వాసం, నిష్కామ కర్మ, మరియు క్రమశిక్షణతో కూడిన జీవనం ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని పెంచుతాయని అన్నారు. కుల, మత, వర్గ విభేదాలను మర్చిపోయి, మానవుడిగా ప్రతి ఒక్కరూ సన్మార్గాన్ని అనుసరించడమే నిజమైన భక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, చిన్న మధు, ప్రభాకర్, సందీప్ రెడ్డి, అశోక్, వెంకటేష్, రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా గొట్టిముక్కల జశ్వంత్‌రావు (దేశాల్) జన్మదిన వేడుకలు

## శుభాకాంక్షలు తెలిపిన జనంపల్లి పురేందర్ రెడ్డి



కూకట్ పల్లి, మార్చి 28 (ప్రభాత సూర్య) : గొట్టిముక్కల జశ్వంత్ రావు (దేశాల్) జన్మదిన వేడుకలు వివేకానంద నగర్ డివిజన్ శేషాద్రి నగర్ లో గల ఆయన నివాసంలో జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ జన్మదిన వేడుకలకు రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి హాజరై ఆయనకు కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ అష్ట ఐశ్వర్యాలతో ఆరోగ్యంతో ఎల్లప్పుడూ 100 సంవత్సరాలు జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా కోరుచున్నానని అన్నారు. రాజకీయంగా ఉన్నత పదవులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలని మనసు పూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, సూర్యనారాయణ, అఖిల్, శ్రీనివాస్, నరసింహారావు తదితరులు పాల్గొని దేశాలు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

గట్టుపల్ ప్రభాత సూర్య.మార్చి28:గట్టుప్పల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్త ఖమ్మం యాదయ్య అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబానికి గట్టుప్పల గ్రామ సర్పంచ్ ఒ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నామని జగన్నాధం 10,000. తెరటుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ వీరమల్ల శ్రీశైలం 10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దండు యాదగిరి రెడ్డి గట్టుప్పల ఉప సర్పంచ్ ఖమ్మం లక్ష్మయ్య వార్డ్ మెంబెర్స్ లాడే యాదయ్య, చెరిపెల్లి వెంకటేశం, పెదగాని నరేందర్, పున్న శివ, గ్రామ శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ భీమగాని మల్లేష్, కార్యదర్శి పగిళ్ల యాదయ్య ఇడం గణేష్. ఖమ్మం రాములు, నరసింహ, రామస్వామి, పాండు, శేఖర్, శ్రీనివాస్ , దుబ్బాక సుధాకర్ మరియు ఇతరులు పాల్గొన్నారు.

# హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 177 వారం అన్నదానం



చందానగర్ ప్రభాత సూర్య : హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ సేవలు మరవలేనివి అని, సమాజాన్ని తనవంతుగా కొంత సేవ చేయాలనే మానవత దృక్పధంతో అన్న దానంతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారికి ఈ సందర్భంగా అభినందనలు తెలుపు తున్నట్లు స్థానిక ప్రజలు అన్నారు. ఈ సందర్భంగా హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరవహిస్తున్న అన్న దాన కార్యక్రమంలో భాగంగా శనివారం 177వ వారం అన్న ప్రసాదం స్థానికుల తో కలిసి కొండ విజయ్ కుమార్ వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి భోజనాలు చేయడం చేయాలా అరుదుగా జరుగుతుందాని అన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా హోప్ సభ్యులు అన్ని జాగ్రత్తలు తీసుకొని వారికి ఏలోటు లేకుండా చేసుకోవటం గొప్ప విషయమని తెలిపారు. అనేక సేవకార్యక్రమలు చేస్తున్న హోప్ ఫౌండేషన్ చర్మన్ తో పాటు సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నందిపహాడ్ అంగన్వాడీలో ఇసిసిఇ డే

మిర్యాలగూడ , మార్చి 28:-( ప్రభాత సూర్య) : మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ సిడిపిఓ రేఖల మమత ఆదేశాల మేరకు సీతారాంపురం సెక్టర్ పరిధి నంది పహాడ్ -2 అంగన్వాడి కేంద్రంలో శనివారం నిర్వహించే ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యు కేషన్ నిర్వహించారు. సూపర్వైజర్ సి. హెచ్.పద్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో 3 నుండి 6 సంవత్సరాల చిన్న వయసులో అంగన్వాడి కేంద్రాలు ప్రీస్కూల్ ద్వారా పిల్లలకు ఆహారం టీకాలు ప్రాథమిక విద్య అందుతాయి పిల్లలను ప్రాథమిక పాఠశాల విద్యకు సహాయపడుతుందన్నారు. చిన్నతనంలోనే ప్రేమతో సంరక్షణ అందిస్తే వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. కావున ప్రతి ఒక్కరూ అంగన్వాడీ కేంద్రంలో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని 3 నుండి 6 పిల్లల తల్లులకు వివరించుకుంటూ కృత్యాలను తల్లుల ముందు పిల్లలచే ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సిహెచ్.పద్మ అంగన్వాడీ టీచర్ వి.శేషు మని, హెల్పర్ ఆర్.కరుణ ఆర్పీలు సరిత. ప్రసన్నలక్ష్మి, పిల్లల తల్లిదండ్రులు కిశోర బాలికలు పాల్గొన్నారు.



# మున్సిపల్ కమిషనర్, మేనేజర్ మేరకు ఆస్తి పన్నులు చెల్లిస్తున్న వినియోగదారులు

ఆలేరు మార్చి 28 ప్రభాత సూర్య : ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను బకాయిలను వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ జగన్మోహన్ ఆదేశాల మేరకు ఒకటో వార్డు లో బ్యుల రాణి ఇంటి పన్ను 54 వేల 614 రూపాయలు బకాయి ఉన్నందున తన సోదరుడు తో పురపాలక సంఘం కార్యాలయానికి పంపించి బకాయిని మొత్తం చెల్లించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ సిబ్బంది వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేష్, షేక్ జాపర్, నాగేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నృత్యాన్ని వేదిక ప్రభావితం చేస్తుంది

## నృత్యానికి, స్థలానికి మధ్య సంబంధాన్ని విశ్లేషించిన డాక్టర్ మల్లాది సంప్రీతి





పటాన్చెరు, మార్చి 28,ప్రభాత సూర్య : మండలం లోని నృత్యం యొక్క శారీరక సౌందర్యం నిర్మిత రూపంతో లోతుగా ముడిపడి ఉందని, ఇక్కడ వేదిక కొలతలు, అనుభవ పూర్వక అమరికలు ప్రదర్శనను గణనీయంగా ప్రభావితం చేస్తాయని వివిధ రంగాలలో నిష్ణాతురాలు, కళాకారిణి డాక్టర్ సంప్రీతి మల్లాది వెల్లడించారు. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లోని లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో 'అంతరిక్షంలోనా లేక వేదికపైనా? భారతీయ నర్తకుల ప్రదేశాల ప్రతిధ్వనులను అన్వేషించడం' అనే అంశంపై శనివారం ఆమె ఆతిథ్య ఉపన్యాసం చేశారు. తన ఉపన్యాసంలో, డాక్టర్ మల్లాది భారతీయ ప్రదర్శన సంప్రదాయాలపై తాను చేసిన విస్తృత పరిశోధన ఆధారంగా, నృత్యానికి, స్థలానికి మధ్య పరిణామం చెందుతున్న సంబంధాన్ని విశ్లేషించారు. ప్రాదేశిక సందర్భాలు శారీరక అభ్యాసాలను ఎలా రూపొందిస్తాయో, వాటిచే ఎలా ప్రభావితమవుతాయో ఆమె వివరించారు. ఈ క్రమంలో, వేదిక గురించిన సాంప్రదాయ అవగాహనను మించిన ఒక దృక్కోణాన్ని ఆమె అందించారు. వాస్తుపరమైన స్థలాలు చట్టబద్ధతను కల్పించే శక్తులుగా పనిచేస్తాయని, చారిత్రాత్మకంగా, నృత్యం, ప్రాదేశిక రూపకల్పనల సమ్మేళనం వాస్తుశాస్త్ర పరిణామంలో అంతర్భాగంగా ఉందని డాక్టర్ మల్లాది పేర్కొన్నారు. నృత్యం, ప్రదేశానికి సంబంధించిన భావనాత్మక, సాహిత్యపరమైన వ్యాఖ్యానాలు, జీవన, తాత్కాలిక ఆచరణలతో నిరంతరం సంభాషిస్తూనే ఉన్నాయన్నారు. ఇవి తరచుగా సంస్థాగత, ప్రభుత్వ ప్రయోజనాలతో ముడిపడి, వాటిచే నియంత్రించబడతాయని పేర్కొన్నారు. ప్రొసీనియం వేదిక దూరం, దృశ్యమానత, హావభావాలను పునర్ నిర్వచించినట్టే, సాంప్రదాయ సభలు కూడా ప్రదర్శకులను, ప్రదర్శనలను తీర్చిదిద్దిన సాంస్కృతిక సంరక్షకులుగా వాటి పాత్రను డాక్టర్ మల్లాది మరింతగా వివరించారు. ఈ చర్చను డిజిటల్ యుగానికి విస్తరిస్తూ, నేటి దృశ్యమానత అనేది అల్గారిథమిక్ విస్తరణ, దృశ్య ఆకర్షణ, పునరావృతమయ్యే స్వభావం, ప్లాట్ ఫామ్ సౌందర్యం వంటి వాటిచే ఎక్కువగా నియంత్రించబడుతోందని, తత్ఫలితంగా కొన్ని అత్యంత స్పష్టంగా కనిపిస్తుండగా, మరికొన్ని అట్టడుగున ఉండిపోతున్నాయని ఆమె గమనించారు. ఈ కార్యక్రమాన్ని లలిత, ప్రదర్శన కళల విభాగం సమన్వయకర్త డాక్టర్ వై. లలిత సింధూరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు ఆఫ్ లైన్, ఆన్ లైన్ (హైబ్రిడ్) పద్ధతిలో చురుకుగా పాల్గొన్నారు. ఇది ప్రదర్శన, ప్రాదేశిక అధ్యయనాల సంగమంతో బలమైన విద్యాపరమైన అనుబంధాన్ని ప్రతిబింబించింది.

# ఘనంగా నరేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు

## శుభాకాంక్షలు తెలియజేసిన వెంకటేశ్వర నగర్ డివిజన్ నాయకులు







కూకట్ పల్లి, మార్చి 28 (ప్రభాత సూర్య): శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని ఆస్బెస్టాస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నరేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా చెవిటి వాళ్లకు చెవుల మిషిన్, హ్యాండీ క్యాప్ వారికి హ్యాండ్ స్టిక్స్, కాళ్లు లేని వారికి వీల్ చైర్స్, అందజేయడం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని పలు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పాపి రెడ్డి నగర్ అధ్యక్షులు ఊట్ల చంద్ర రెడ్డి, ప్రగతి నగర్ 1 అధ్యక్షులు మాచర్ల విష్ణు, వెంకటేశ్వర నగర్ అధ్యక్షులు డాన్ వెంకట్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుల శివకుమార్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేష్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పొన్నాల నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, సంపత్, నాగేందర్, పోశెట్టి, వంశీ, దీపక్, ఇమ్రాన్, రఫీక్, మహమూద్, పుష్ప, శివ గౌడ్, సుబ్బరాజు, గణేష్, రణధీర్ రెడ్డి, నరసింహ, విజయ్, కనకా రెడ్డి పలు బస్తీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ఆదాలత్‌లో 285 కేసులు పరిష్కారం

## సమయం వృధా చేసుకోకుండా పెండింగ్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలి: ఎడిజె చంద్రశేఖర్ రావు





మిర్యాలగూడ, మార్చి 28:- (ప్రభాత సూర్య) : తిరిగి తిరిగి సమయం వృధా చేసుకోకుండా కోర్టుల్లో దీర్ఘ కాలికంగా పెండింగ్ లో కేసులను లోక్ అదాలత్ లో ఫిర్యాది దారులు, కక్షిదారులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని మిర్యాలగూడ ఐదవ అదనపు జిల్లా జడ్జి కెవి.చంద్రశేఖర్ రావు అన్నారు. శనివారం స్థానిక కోర్టుల సముదాయ ఆవరణలో జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్ ను ప్రారంభించి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా కోర్టుల్లో ఉన్న కేసులను ఇరువర్గాలు కూర్చుని మాట్లాడుకోవాలన్నారు. ప్రతి రోజు కోర్టుల్లో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం రోడ్డు ప్రమాదం కేసులో పది లక్షల పరిహారం కోసం కేసు వేసిన వ్యక్తి ఐదు లక్షలకు రాజి పడి అదనపు జిల్లా జడ్జి నుండి అవార్డు తీసుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన లోక్ ఆదాలత్ లో ఐదో, అదనపు జిల్లా జడ్జి కోర్టులో ఎంవి యాక్ట్ క్రింద 4 కేసులు పరిష్కరించి రూ. 35.6లక్షలు పరిహారం చెల్లించేలా ఆదేశాలు, సబ్ కోర్టులో 2ఓఎస్ లకు రూ.6.66లక్షలు చెల్లించేలా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 18 క్రిమినల్, 8 ఎల్ఎ (ఐపిసి), ప్రథమ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 18 క్రిమినల్, 10 సీసీ ఐపీసీ, ఆర్థిక లావాదేవీల29, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో క్రిమినల్ 18,సీసీ ఐపీసీ 10, పరిహారం 19కేసులు పరిష్కరించారు. అదాలత్ లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.పవన్ కుమార్, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. లావణ్యరాణి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. అరుణ్ తేజ్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేతి సత్యనారాయణ, ఎ.భూపతిరెడ్డి, న్యాయవాదులు ఎండి.ఇబ్రహీం, కొంక వెంకన్న, ఒన్, టూ టౌన్ ఇన్స్పెక్టర్లు ఎం. నాగభూషణరావు, జె.సోమనర్సయ్య, రూరల్ ఎస్ఐ ఎం.లక్ష్మయ్యలు పాల్గొన్నారు.



## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా బార్ అసోసియేషన్ నూతన కమిటీ

ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి) : ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ 2026-2027 సంవత్సరానికి నూతనంగా ఎన్నికైనా ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు యడ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఎన్నికైన నూతన కమిటీ మెంబెర్స్ అందరు ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు యడ్లపల్లి రమేష్ వైస్ ప్రెసిడెంట్ షేక్ జానీమియా జనరల్ సెక్రటరీ కొప్పుల రవి కుమార్ జాయింట్ సెక్రటరీ శిరీష స్పోర్ట్స్ సెక్రటరీ రామ్ దాస్ నాయక్ లైబ్రరీ సెక్రటరీ కళ్యాణి ట్రెజరర్ కేవీడీ రాజేశ్వరి లేడీ రిప్రజెంటేటివ్ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.




# అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా ఆశా వర్కర్ల ఆగ్రహం

## ::: హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక

బాలానగర్, మార్చి 28 (ప్రభాత సూర్య) : సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ మండలంలో ఆశా వర్కర్లపై జరిగిన అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అనిత, రేవతి తెలిపారు. ప్రజల ఆరోగ్య సేవలకు అంకితభావంతో పనిచేస్తున్న ఆశా వర్కర్లను ఈ విధంగా నిర్బంధించడం అన్యాయమని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆమె మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆశా వర్కర్లు చాలా కాలంగా తమ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్నారని, కానీ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తక్షణమే అక్రమంగా అరెస్టు చేసిన ఆశా వర్కర్లను విడుదల చేయాలని, వారిపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయడం, ఉద్యోగ భద్రత కల్పించడం, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించడం, పనికి తగిన గుర్తింపు ఇవ్వడం వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచిపోకుండా అమలు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య వ్యవస్థలో ఆశా వర్కర్ల పాత్ర ఎంతో కీలకమని, గ్రామీణ ప్రాంతాల్లో వారు అందిస్తున్న సేవలు అమూల్యమని పేర్కొంటూ, అలాంటి వారిని అణచివేయడం కంటే వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతన్నారు. ఈ సంఘటనపై ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు స్పందించి ఆశా వర్కర్లకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.






# నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ వార్డు సభ్యుల శిక్షణ

మిర్యాలగూడ మార్చి 28:-( ప్రభాత సూర్య) : మిర్యాలగూడ మండలంలో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ వార్డు సభ్యుల ఐదు రోజుల శిక్షణ సోమవారం ప్రారంభించి శనివారం ముగిసింది. మిర్యాలగూడ మండలంలోని 46 గ్రామ పంచాయతీల 394 మంది వార్డు సభ్యులకు రెండు బ్యాచ్లుగా చేసి టిఓటి సతీష్, మురళీమోహన్, దుర్గయ్యలు పంచాయతీరాజ్ చట్టం, గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల బాధ్యతలపై వారికి అవగాహన కల్పించారు. 2018 పంచాయతీ రాజ్ చట్టం, గ్రామపంచాయతీ విధులు బాధ్యతలు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల విధులు బాధ్యతలు గ్రామపంచాయతీల సమావేశాలలో పారిశుద్ధ్యం, వనమహోత్సవం, వీధి దీపాల నిర్వహణ, పన్నుల వసూళ్లు, గ్రామపంచాయతీ పనుల నిర్వహణ అభివృద్ధి ప్రణాళిక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుట మొదలగు వాటి గురించి శిక్షణ ఇచ్చారు. ముగింపులో శ్రీనివాస్ నగర్, తుంగపాడు వార్డు సభ్యులు బుచ్చిరెడ్డి, నవ్య, శ్రీనివాస్ ఐలాపురం వార్డు సభ్యులు శిక్షణ తరగతులు బాగా నిర్వహించినారని చట్టం గురించి అందరికీ అవగాహన కల్పించినారు. వార్డు సభ్యులు శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్న వారికీ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఎం.శేషగిరిశర్మ, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు, సూపరింటెండెంట్ కర్ణాకర్ రావు, సీనియర్ అసిస్టెంట్ పాషా, కంప్యూటర్ ఆపరేటర్లు మణికంఠ పృథ్వీతేజ, చారి, మౌనిక, టైపిస్టు ఫిరోజ్ పాల్గొన్నారు.



# వేముల వీరేశంకు శుభాకాంక్షలు తెలియజేసిన కళ్లెం నరసింహా

చిట్యాల, మార్చి 28(క్రైమ్ మిర్రర్ ): నకిరేకల్ నియోజకవర్గం శాసనసభ్యులు వేముల వీరేశం ప్రభుత్వ విప్ గా నియామకం జరగడంతో నల్లగొండ జిల్లా బేడ బుడగ జంగాల నాయకులు కళ్లెం నరసింహా ఆధ్వర్యంలో ఆ కుల సంఘ పెద్దలు నాయకులు ఎమ్మెల్యే వేములను శనివారం నాడు నకరేకల్ క్యాంప్ ఆఫీసులో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యేకు ప్రభుత్వ విప్ రావడంతో నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు ముఖ్యంగా పేద బడుగు బలహీన వర్గాలకు లాభం చేకూరుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలోబేడ బుడగ జంగాల నాయకులు శిరీషాల నరసింహ, కళ్లెం వెంకటేష్,కళ్లెం భాష,శిరీషాల శివ,కళ్లెం ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బిర్యానీలో ప్లాస్టిక్ కవర్లు

## మన్నెగూడలోని జైకా హోటల్ నిర్వాకం

**హోటళ్లపై ఫుడ్ ఇన్‌స్పెక్షన్ అధికారులు నిర్లక్ష్యం .. తనిఖీలు శూన్యం**

**వినియోగదారుల ఆరోగ్యాలతో ఆటలాడుతున్న హోటల్ యాజమాన్యాలు**





తుర్కయంజాల్,ప్రభాత సూర్య: ఒకవైపు ఆహార భద్రతపై ప్రభుత్వాలు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నాయని చెబుతుంటే, మరోవైపు హోటళ్లలో నిర్లక్ష్యం పరాకాష్టకు చేరుతోంది. ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని మన్నెగూడ జైకా హోటల్ లో బిర్యానీ ఆర్డర్ చేసిన వినియోగదారులకు అందిన ఆహారంలో ప్లాస్టిక్ కవర్ల ముక్కలు బయటపడటం కలకలం రేపుతోంది. ఈ విషయమై వినియోగదారులు హోటల్ యాజమాన్యాలపై మండి పడుతున్నారు. సంబంధిత సర్కిల్ అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిర్యానీ వంటి ప్రముఖ వంటకంలో ప్లాస్టిక్ ఉండటం ఆరోగ్యానికి తీవ్ర ముప్పు కలుగుతుంది. ఈ ప్లాస్టిక్ ముక్కలు పొరపాటున తిన్నట్లయితే జీర్ణ సంబంధిత సమస్యలు, గొంతులో ఇరుక్కుపోవడం వంటి ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉంది. హోటళ్లలో వంట చేసే సమయంలో పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో నిల్వ చేయడం, లేదా ప్యాకింగ్ సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. ఫుడ్ ఇన్‌స్పెక్షన్ అధికారులు తనిఖీలు నిర్వహించడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తరచూ తనిఖీలు జరిపి, నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

# అభివృద్ధి దిశగా సంస్థాన్

**సిసి రోడ్లు పనుల నాణ్యత పరిశీలిస్తున్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి**





సంస్థాన్ నారాయణపురం, మార్చి 28(ప్రభాత సూర్య): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఒకటో వార్డులో సిసి రోడ్ పనుల నాణ్యత పరిశీలిస్తు నారాయణపురని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళ్తున్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

ఈ కార్యక్రమంలో 1వ వార్డు మెంబర్ బల్గూరి శివ, 13వ వార్డు మెంబర్ సింగపంగా ప్రశాంతి రమేష్, పల్లె సీతారాం రెడ్డి, చిలుకూరి శ్రీను , క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, భూపని బలరాం, విడం వెంకటేశం, బద్దుల యాదయ్య , మేకని శ్రీను, దోర్నాల అంజయ్య, వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోలీసు వీర భద్రయ్య 12వ వర్ధంతి

**సేవా కార్యక్రమాలతో వీర భద్రయ్య వర్ధంతి నిర్వహణ**

**పులివెందులలో సేవా కార్యక్రమాలు నిర్వహణ**

**నిత్యావసరాల పంపిణీ, ఉపాధి అవకాశాలపై పిలుపు**






పులివెందుల, మార్చి 28(ప్రభాత సూర్య): స్వర్గీయ పోలీసు వీర భద్రయ్య 12వ వర్ధంతి సందర్భంగా పులివెందులలో దివ్యాంగులకు సహాయం అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సంస్మరణ సభలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీరామ్ ముఖ్య అతిథిగా పాల్గొని, దివ్యాంగులకు సరుకులు అందజేశారు.భవిష్యత్తులో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సరస్వతి, రీసెర్చ్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## వాణిజ్య వాహనాల రేడియం స్టికర్ ఓపెన్ మార్కెట్ కంటే అధికంగా చేయటం తగ్గించాలి

మిర్యాలగూడ మార్చి 28:- (ప్రభాత సూర్య) : వాణిజ్య వాహనాల ఫిట్ నెస్ రేడియం స్టికర్ రిఫలెక్టర్ స్టికర్ల అధిక ధరలు తగ్గించాలని, పరిమిత సరఫరాపై సమీక్షించాలని కోరుతూ శనివారం స్థానిక మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం ముందు మిర్యాలగూడ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, ఎఎంవిఐ సిహెచ్.భాస్కర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సింగాపురం మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ వాణిజ్య వాహనాలకు రేడియం రిఫ్లక్టర్ స్టిక్కర్ల కొనుగోలు విషయంలో ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న విధానం వల్ల చిన్న మధ్య తరహా వాహన యజమానులపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్నారు. రవాణా శాఖ నియమించిన డీలర్లు, కాంట్రాక్టర్ల ద్వారానే స్టిక్కర్లు కొనాలని నిర్ణయం వల్ల అధిక భారం పడుతున్నదన్నారు. మార్కెట్ ధర కంటే డీలర్, కాంట్రాక్టర్ ధర రెండింతలు ఉన్నదన్నారు. ఓపెన్ మార్కెట్ కంటే స్టిక్కర్లకు రూ.5,000 నుండి రూ.10,000కు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. స్టిక్కర్ల అధిక ధరల భారం తగ్గించి వాహన యజమానులకు ఉపశమనం కలిగించాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి మర్రి సురేష్ రెడ్డి, కోశాధికారి ఎ. నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు ఎ. నాగరాజు, కార్యదర్శి జి.రాంభద్రారెడ్డి, ఇక్బాల్ పాషాలు పాల్గొన్నారు.



## పార్టీకి కష్టపడ్డ వారికే పదవులు

**::: డీసీసీ ప్రధాన కార్యదర్శి బ్రహ్మంచారి**

పెబ్బేరు మార్చి28 ప్రభాత సూర్య : కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికే పదవులు దక్కుతాయని డీసీసీ ప్రధాన కార్యదర్శి బ్రహ్మంచారి పేర్కొన్నారు.పెబ్బేరు మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశంలో శనివారం డిసిసి ప్రధాన కార్యదర్శి బ్రహ్మం చారి ముఖ్యఅతిథిగా పాల్గొని దశ దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కోసం చేసిన కృషిని గుర్తించి పదవులు. ఎవరు కూడా పదవిని దుర్వినియోగం చేయకూడదని పార్టీ అభ్యున్నతి కోసం మాత్రమే పాటుపడాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసే వారికి పార్టీ పదవులు వస్తాయని పదవులు అలంకారప్రాయంగా కాకుండా మళ్లీ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే దిశగా కృషి చేయాలని ఆయన కోరారు. డిసిసి అధ్యక్షులు శివసేనారెడ్డి,ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి లతో సంప్రదించి పెబ్బేరు మున్సిపాలిటీ కమిటీని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామని అన్నారు.కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి,వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్ లు శివసాయి,తాటికొండ కృష్ణ, డీసీసీ కార్యదర్శి వెంకటేష్ సాగర్,జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు రంజిత్ కుమార్,మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్,డైరెక్టర్ రామన్ గౌడ్,సీనియర్ నాయకులు దయాకర్ రెడ్డి,రాములు యాదవ్, రాంచంద్రారెడ్డి, షకీల్, సత్యనారయణ, రాధాకృష్ణ,మాజీ డైరెక్టర్ రాములు,వినయ్,రజక నరసింహ,జహంగీర్,యూత్ కాంగ్రెస్ నాయకులు శివ,కురుమూర్తి,రాజు,దాసరి రాములు,రంగం నరసింహ,ఉత్తమ్ కుమార్,రాజా గౌడ్,వెంకట్రాములు యాదవ్,శ్రీ రాములు,మహేష్,టైలర్ రాజగౌడ్,కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్తపల్లి గ్రామ పరిధిలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ప్రారంభం

నల్గొండ ప్రభాత సూర్య : నల్గొండ పట్టణ కేంద్రం డీవీకే కథాలగూడ రోడ్డు కొత్తపల్లి గ్రామ పరిధి లో శనివారం పద్మారావు, నాగేశ్వరరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు ఇండియన్ ఆయిల్ వారి సహకారంతో రైతులకు, వ్యాపారస్తులకు, వివిధ రకాల వాహనాల యజమాన్యాలకు తెలియజేయునది ఏమనగా మా యొక్క ఇండియన్ ఆయిల్ పెట్రోల్, డీజిల్ మరియు ఇంజన్ ఆయిల్ లభించునని ప్రభుత్వం అనుమతితో, విధివిధానాలకు నాణ్యత ప్రమాణాలకు లోబడి మా యొక్క ఇండియన్ ఆయిల్ కొత్తపల్లి గ్రామం యజమాన్యం పాటిస్తుందని తెలిపారు. అదేవిధంగా వాహనదారులకు ఉచితంగా త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు, టైర్లలో గాలి చెకప్ కొరకు మా యొక్క సర్వీస్ లు చేయబడతాయని పట్టణ, గ్రామ ప్రజలు మరియు వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ అజయ్ మీనా, సర్పంచులు వాహనదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్లా ఐలయ్య చిత్రపటానికి పలాభిషేకం






ఆలేరు మార్చి 28 ప్రభాత సూర్య : ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో గంధమల్ల రిజర్వేయర్ నుండి బిక్కేరు వాగులోకి విడుదల చేసిన సాగు నీరును స్థానిక బిక్కేరు వాగులో పారుతున్న సందర్భంగా శనివారం రోజున వాగులో గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బిర్లా ఐలయ్య ప్లెక్సీ బొమ్మకు పాలాభిషేకం చేసిన మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ ఎజాజ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానదేవుడు కరుణిస్తే తప్ప ఈ వాగులో నీళ్లు రావని, అలాంటిది గోదావరి నీళ్లను పారించిన ఘనత మన ఎమ్మెల్యే బిర్లా ఐలయ్యదని కొనియాడారు. దీనివలన వేలాది ఎకరాల వరిసాగుకు నీరు అందుతుందని రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఆలేరు నియోజకవర్గాన్ని సాగునీటితో సస్యశ్యామలం చేయడమే ఎమ్మెల్యే లక్ష్యమని చెప్పారు. ఎండాకాలంలో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, కౌన్సిలర్లు వానరాసి మరియమ్మ మార్కు, మల్లెల సరిత శ్రీకాంత్, జెట్ట నిరజ సిద్దులు, పస్తం ఆంజనేయులు, జూకంటి సంపత్, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెస్ విజయకుమార్, కట్టెగుమ్ముల సాగర్ రెడ్డి, ఎగ్గిడి శ్రీశైలం, ఎండి సలీం, ఎండి జైనుయోద్దీన్, దూసరి మురళి,దూడల రాజేందర్ గౌడ్, ముదిగొండ శ్రీకాంత్, ఆలేటి అనిల్, పోరెల్ల సతీష్, పత్రి రమేష్ , తాళ్లపల్లి మహేష్, ఎండి బాబా తదితరులు పాల్గొన్నారు.

# నీటి వినియోగంపై బాధ్యతగా వ్యవహరించాలి

## డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, సెంట్రల్ భూగర్భ శాఖ అధికారి సుధీర్ గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి






సంస్థాన్ నారాయణపూర్,మార్చి 28, (ప్రభాత సూర్య) : వర్షపు నీటి ప్రతిబిందువును నిల్వచేసి భూగర్భ జలాలుగా మారిస్తే భావితరాలకు నీటి కొరత లేకుండా చేయవచ్చునని డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహణ సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా భూగర్భ జల శాఖ యాదాద్రి భువనగిరి సహకారంతో "నీరు మరియు లింగ సమానత్వం" థీమ్‌తో 36వ ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని రైతు వేదికలో నిర్వహించిన్న ఈ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులగా ఆర్. డి ఓ శేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ... రోజురోజుకు విస్తరిస్తున్న పట్టణీకరణ, ఎక్కువ నీటీ అవసరాలు ఉండటం, వర్షపు నీరు భూగర్భ జలాలు ఇంకించకపోవడం వల్ల అధికముగా నీటి వినియోగం వల్ల నీటి కొరత సమస్య మరింత తీవ్రమవుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి తగినంత నీరు అందించాలంటే ప్రతి రైతు సూక్ష్మ బిందుసేద్యం ద్వారా వ్యవసాయ సాగు చేసేలా ప్రయత్నిస్తే నీటి సంరక్షణను అమలు చేయడం జరుగుతుందని అయన తెలియదు చేశారు. అనంతరం జిల్లా భూగర్భ జిల్లా అధికారి మాట్లాడుతూ... వర్షపు నీటి ప్రతి బిందువును నిల్వచేసి భూగర్భ జలాలుగా మారుస్తే భావితరాలకు నీటి కొరత లేకుండా చేయవచ్చని అభిప్రాయపడ్డారు. పౌరులందరూ తమ బాధ్యతను గుర్తించి, తమ నివాస ప్రాంతాల్లో నీటి సంరక్షణకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. నీటి సంరక్షణ కొరకు రైతులు ఎలా సంరక్షణ చర్యలు చేపట్టాలి, నీటిని నిల్వ చేసే పద్ధతులు, వాటి ఫలితాలను రైతులకు, మహిళలకు వివరించారు. భవిష్యత్తులో నీటి సంరక్షణపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి మాట్లాడుతూ... రానున్న వేసవికాలం దృష్ట్యా నీటిని పొదుపు చేయాలని తెలిపారు. జియాలజీ అధికారులు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. చెక్‌డ్యామ్‌లు, రీచార్జ్ కుళాయిలు, వర్షపు నీటి నిల్వ చర్యలు విజయవంతమైన ఫలితాలను ఇస్తున్నాయని శాస్త్రవేత సెంట్రల్ భూగర్భ శాఖధికారి సుధీర్ వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి ద్వారా రైతులకు సాగునీటి లభ్యత పెరిగి ఆదాయం కూడా మెరుగుపడుతోందని తెలిపారు. మహిళలు విద్యార్థులు, యువత నీటి సంరక్షణలో ముందుండాలని, ప్రతి ఇంటిలో నీటి వినియోగంపై బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. చివరగా నీటి పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమములో నీటిని పొదుపుగా వినియోగిస్తూ కూరగాయల సాగు ద్వారా నీటి సంరక్షణలో ఆదర్శంగా ఉన్న సంస్థ నారాయణపూర్ కు చెందిన సుజాతను అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమములో మండల రెవిన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి , వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు జిల్లా ఫిషరీస్ అధికారి, మిషన్ భగీ రత అధికారి, ఉద్యయన శాఖ అధికారి మాధవి, సీడ్ స్వచ్ఛంద సంస్థ సి. ఈ.ఓ ఎస్. నాగబ్రహ్మ చారి రైతులు మహిళ లు , గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ నుండి ఐశ్వర్య శ్రీకాంత్ రెడ్డి, వినోదు లు పాలొగొన్నారు.

## ఉగ్రభూమిగా పాకిస్థాన్..
## గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్‌లో అగ్రస్థానం

ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం తగ్గుముఖం పడుతున్నప్పటికీ, పాకిస్థాన్ మాత్రం దానికి పూర్తి భిన్నమైన దిశలో పయనిస్తోంది. గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ (జీటీఐ) 2026 ప్రకారం, ఉగ్రవాదం వల్ల అత్యంత ఎక్కువగా ప్రభావితమైన దేశంగా పాకిస్థాన్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ నివేదికలోని గణాంకాలు పాకిస్థాన్ ఎదుర్కొంటున్న తీవ్రమైన అంతర్గత సవాళ్లను, దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానాల వైఫల్యాలను స్పష్టంగా ఎత్తిచూపుతున్నాయి. గ్రీక్ సిటీ టైమ్స్ తన కథనంలో వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ సూచీలో పాకిస్థాన్ ఉగ్రవాదానికి కేంద్ర బిందువుగా నిలిచింది. 2025 సంవత్సరంలోనే దేశంలో 1,045 ఉగ్రదాడులు జరిగాయని, వాటిలో 1,139 మంది ప్రాణాలు కోల్పోయారని నివేదిక వివరించింది. మరో 1,595 మంది గాయపడగా, 655 మందిని ఉగ్రవాదులు బందీలుగా పట్టుకున్నారు. ఇండెక్స్‌లో 8.574 స్కోరుతో పాకిస్థాన్ అన్ని దేశాల కంటే ముందుంది. 2013 తర్వాత పాకిస్థాన్‌కు ఇదే అత్యంత హింసాత్మక సంవత్సరమని నివేదిక పేర్కొంది. ప్రపంచమంతటా ఉగ్రవాదం తగ్గుతుంటే, పాక్‌లో ఈ స్థాయి పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. పాకిస్థాన్‌లో జరుగుతున్న హింస భౌగోళికంగా కొన్ని ప్రాంతాలకే పరిమితమైందని నివేదిక గుర్తించింది. ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులలోనే 2025లో మొత్తం దాడుల్లో 74 శాతం, మరణాల్లో 67 శాతం నమోదయ్యాయి. ఈ ప్రాంతాలు నిరంతర అస్థిరత, బలహీనమైన ప్రభుత్వ నియంత్రణతో ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయని నివేదిక తెలిపింది. ఆఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దు వెంబడి దశాబ్దాలుగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉదాసీన వైఖరే ఇందుకు కారణమని విశ్లేషించింది. పాకిస్థాన్‌లోని గిరిజన ప్రాంతాలు చాలా కాలంగా పాక్షిక పాలనలో ఉండటం వల్ల అల్-ఖైదా, హక్కానీ నెట్‌వర్క్, స్థానిక ఉగ్ర సంస్థలకు సురక్షిత స్వర్గధామంగా మారాయని నివేదిక వెల్లడించింది. డ్యూరాండ్ లైన్‌కు ఇరువైపులా ఉన్న జాతి, సామాజిక బంధాలు సరిహద్దులు దాటి ఉగ్రవాదుల కదలికలకు మరింత ఆస్కారం కల్పిస్తున్నాయని పేర్కొంది. దీనివల్ల నిఘా, నియంత్రణ సంక్లిష్టంగా మారాయి. ప్రభుత్వ పాలన బలహీనంగా ఉన్న చోట ఉగ్రవాద నెట్‌వర్క్‌లు ఎలా పనిచేస్తాయో ఈ పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయని నివేదిక నొక్కి చెప్పింది.

## పారిశ్రామిక దిగ్గజం
## విజయ్‌పత్ సింఘానియా అస్తమయం



ప్రముఖ వస్త్ర బ్రాండ్ రేమండ్ గ్రూప్ మాజీ చైర్మన్, పద్మభూషణ్ పురస్కార గ్రహీత విజయ్‌పత్ సింఘానియా (87) కన్నుమూశారు. నిన్న సాయంత్రం ముంబైలోని తన నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు, రేమండ్ గ్రూప్ ప్రస్తుత చైర్మన్ గౌతమ్ సింఘానియా సోషల్ మీడియా ద్వారా ధ్రువీకరించారు. విజయ్‌పత్ సింఘానియా కేవలం పారిశ్రామికవేత్తగానే కాకుండా, సాహసవంతుడైన ఏవియేటర్‌గానూ ప్రత్యేక గుర్తింపు పొందారు. 1988లో మైక్రోలైట్ విమానంలో లండన్ నుంచి న్యూఢిల్లీకి ఒంటరిగా ప్రయాణించి రికార్డు సృష్టించారు. 2005లో హాట్ ఎయిర్ బెలూన్‌లో దాదాపు 69వేల అడుగుల ఎత్తుకు వెళ్లి మరో ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఆయన సేవలకు గానూ భారత ప్రభుత్వం 2006లో దేశంలోని మూడో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌తో సత్కరించింది. 1980 నుంచి 2000 వరకు ఆయన రేమండ్ గ్రూప్‌కు చైర్మన్‌గా సేవలు అందించారు. కొన్నేళ్ల క్రితం కంపెనీ యాజమాన్య హక్కులను తన కుమారుడికి బదిలీ చేసిన తర్వాత తండ్రీకొడుకుల మధ్య ఆస్తి వివాదాలు తలెత్తడం గమనార్హం. అయితే, ఆ తర్వాత వారు సమస్యలను పరిష్కరించుకున్నట్లు సమాచారం. కాగా, ఆయన అంత్యక్రియలను ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ముంబైలోని చందన్‌వాడి శ్మశానవాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబం ఒక ప్రకటనలో తెలిపింది. సింఘానియా ఒక దార్శనిక నాయకుడని, ఆయన వారసత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని కుటుంబం నివాళు లర్పించింది.

## హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం
## ఇద్దరికీ గాయాలు చికిత్స పొందుతూ మృతి

మిర్యాలగూడ మార్చి 28:- (ప్రభాత సూర్య) : మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామంలో నార్కెట్ పల్లి -అద్దంకి స్టేట్ జి హై వేపై బెజవాడ చంద్రమ్మ వయసు 60 సంవత్సరాలు, ఆమె మనవరాలు బెజవాడ చందన వయస్సు 10 సంవత్సరాలు గ్రామ సెంటర్లో రోడ్డు దాటుతుండగా అదే సమయంలో వాడపల్లి వైపు నుండి మిర్యాలగూడ వైపుకు వెళ్తూ టీఎస్ 08 జెఎన్ 0545 మోటార్ సైకిల్ నడుపుతున్న ఒకరు అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డు దాటుతున్న ఇద్దరికీ ఢీ కొట్టగా చంద్రమ్మకు కుడికాలు, ఆమె మనవరాలు చందనకు ఎడమ కాలు విరిగి లోపల గాయాలు కాగా ఇరువురిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బెజవాడ చందనను హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా ఫిర్యాదు ఈ నెల 27న మధ్యాహ్నం 12.50 చేయడంతో గంటలకు చనిపోయినట్టు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని రూరల్ ఎస్ఐ ఎం.లక్ష్మయ్య శనివారం తెలిపారు.




## మునుగోడులో
## వెంకటేశ్వరస్వామి గుడి నిర్మాణానికి వాస్తు పూజా.

మునుగోడు ప్రభాత సూర్య : మునుగోడు మండల కేంద్రంలోని గాంధీనగర్ విద్యుత్ కార్యాలయం ఎదురుగా నూతనంగా నిర్మాణం చేపట్టనున్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం కు వాస్తుపూజా ( శంకుస్థాపన ) కార్యక్రమం చేపట్టారు..సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు.ప్రతి ఒక్కరు ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి, సాగర్ల శ్రీను, దొమ్మాటి రాజు,యారసాని రాములు,నరసింహ,పాల్వాయి జితేందర్ రెడ్డి, లింగయ్య, వెంకన్న, జానిమియా,రామస్వామి,లింగస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.



## వట్టిపల్లి శ్రీనివాస్ దంపతులు,
## అజయ్-యోధ దంపతుల పెళ్లిరోజు వేడుకలో
## పాల్గొన్న వైస్ చైర్మన్ ఆంజనేయులు

ఆలేరు మార్చి 28 ప్ర బా తసూర్య : బహదూర్‌పేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వట్టిపల్లి శ్రీనివాస్, సుజాత దంపతులు మరియు వారి కుమార్తె-అల్లుడు అజయ్, యోధ దంపతుల పెళ్లిరోజులు ఒకే రోజు రావడంతో, వారి నివాసంలో పెళ్ళిరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, సన్నిహితులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వారిచే కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు పాల్గొని, శ్రీనివాస్ సుజాత, యోధ అజయ్ దంపతులకు హృదయపూర్వక పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. దంపతుల దాంపత్య జీవితం సుఖశాంతులతో, ఆనందాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోగా, నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాల్గొన్నవారు దంపతులు దీర్ఘాయుష్షుతో సంతోషంగా జీవించాలని కోరుతూ అభినందనలు తెలిపారు.

## సౌదీ అరేబియా యువరాజుతో ఫోన్‌లో మాట్లాడిన మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సౌదీ అరేబియా యువరాజు, ప్రధానమంత్రి మహమ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ, ఆయా దేశాధినేతలతో ప్రధాని మోదీ సంప్రదింపులు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సౌదీ ప్రధానితో మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను మోదీ ఖండించారు. నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగడం, షిప్పింగ్ మార్గాలను సురక్షితంగా తెరిచి ఉంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సౌదీ అరేబియాలోని భారతీయులకు నిరంతరం తోడ్పాటు అందిస్తున్నందుకు యువరాజుకు ధన్యవాదాలు తెలిపారు. "సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో మాట్లాడి, పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణపై చర్చించాను. ప్రాంతీయ ఇంధన మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను భారత్ ఖండిస్తుందని పునరుద్ఘాటించాను" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రధాని మోదీ పలుమార్లు గల్ఫ్ దేశాధినేతలతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ నేపథ్యంలో యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఇరాన్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, మలేషియా దేశాధినేతలతో ఇటీవల ప్రధాని మోదీ మాట్లాడారు. పరిస్థితులపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారు.

# ఒక్కో షేరుకు 1100 శాతం డివిడెండ్ ప్రకటించిన వేదాంత..




మైనింగ్ రంగంలోని లార్జ్ క్యాప్ కేటగిరి కంపెనీ వేదాంత లిమిటెడ్ తమ షేర్ హోల్డర్లకు అదిరే శుభవార్త చెప్పింది. 2026 ఆర్థిక సంవత్సరానికి గానూ ఒక్కో ఈక్విటీ షేరుకు 1100 శాతం మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు బోర్డ్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించింది. అర్హులైన వారిని గుర్తించే రికార్డు డేట్ మార్చి 28గా నిర్ణయించినట్లు తెలిపింది. ఈరోజు ట్రేడింగ్ సెషన్లో ఈ షేర్ 3 శాతానికి పైగా లాభాల్లోకి వచ్చింది. మరి ఈ స్టాక్ గురించి తెలుసుకుందాం. లార్జ్ క్యాప్ కేటగిరిలోని మైనింగ్ సెక్టార్ కంపెనీ వేదాంత లిమిటెడ్ (ఎవఝుత్ఝు ూఱఎఖ్వఏ) ఇటీవలే తమ షేర్ హోల్డర్లకు అదిరే శుభవార్త అందించింది. మధ్యంతర డివిడెండ్ ప్రకటించడంతో పాటు రికార్డ్ తేదీ వెల్లడించింది. ఇప్పుడు ఈ రికార్డ్ తేదీ సమీపిస్తున్న క్రమంలో వేదాంత లిమిటెడ్ షేర్లు ఈరోజు (మార్చి 24) ప్రారంభ ట్రేడింగ్ సెషన్లో 3 శాతానికి పైగా దూసుకెళ్లింది. 2026 ఆర్థిక సంవత్సరానికి గానూ ఒక్కో షేరుకు 1100 శాతం మధ్యంతర డివిడెండ్ చెల్లిస్తామని తెలిపింది. రికార్డు డేట్ మార్చి 28గా కంపెనీ డైరెక్టర్స్ బోర్డు నిర్ణయించింది. ఈ కారణంగా ఈరోజు ఈ కంపెనీ స్టాక్ లాభాల్లో ట్రేడవుతోంది. మరోవైపు గత ఏడాది కాలంలో ఈ షేర్ 38 శాతం లాభాన్ని అందించింది. కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. ఇటీవలే జరిగిన కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉన్న ఒక్కో ఈక్విటీ షేరుకి 1100 శాతం అంటే రూ.11 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు ఆమోదం తెలిపింది. ఈ మధ్యంతర డివిడెండ్ కి అందుకునేందుకు అర్హులైన షేర్ హోల్డర్లను నిర్ణయించే రికార్డు డేట్ మార్చి 28, 2026గా నిర్ణయించింది. ఎవరి పేర్లు రికార్డు డేట్ నాటికి కంపెనీ రికార్డ్ బుక్స్ లో ఉంటాయో వారికి మాత్రమే ఈ మధ్యంతర డివిడెండ్ పొందేందుకు అర్హత లభిస్తుంది. ప్రస్తుత స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్లో వేదాంత లిమిటెడ్ షేరు 1.2 శాతం లాభంతో రూ. 653.50 వద్ద ట్రేడవుతోంది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 769.80 వద్ద ఉండగా, 52 వారాల కనిష్ఠ ధర రూ. 363 వద్ద ఉంది. గత వారం రోజుల్లో ఈ షేరు 5 శాతం నష్టపోయింది. గత నెల రోజుల్లో 6 శాతం నష్టాన్ని మిగిల్చింది. గత ఆరు నెలల్లో 46 శాతం లాభాన్ని అందించింది. గత ఏడాది కాలంలో 38 శాతం లాభాన్ని ఇచ్చింది. గత ఐదు సంవత్సరాల కాలంలో 188 శాతం లాభాన్ని అందించింది.

# గ్యాస్ ధరలు పెరిగాయ్..
# పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా?

ఇరాన్- ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం పశ్చిమాసియాలో తీవ్ర రూపం దాల్చుతోంది. హార్మూజ్ జల సంధిని మూసివేయడం, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులతో చమురు ఉత్పత్తికి, సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో దేశీయం నిల్వలు తగ్గిపోయి ధరలు పెంచే పరిస్థితి వస్తుందని వార్తలు వస్తున్నాయి. వంట గ్యాస్ ధరలను కేంద్రం పెంచడంతో ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరింది. మరి భారత్ లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా? కేంద్ర ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటనలో ఏముంది? తెలుసుకుందాం. దేశంలో వంట గ్యాస్ సిలిండర్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఒక్కో సిలిండర్‌పై రూ.60 మేర పెంచేసింది. మరి ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలను సైతం పెంచుతుందా? అనే ప్రశ్న సగటు భారతీయుడి మెదడులో తిరుగుతోంది. ఎందుకంటే పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలతో ఇంధన సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఇతర దేశాలను కొనుగోలు చేస్తామని చెబుతున్నా దేశీయంగా కొరత ఏర్పడవచ్చన్న అంచనాలు భారతీయులను కలవరపెడుతున్నాయి. ఇజ్రాయెల్‌తో యుద్ధం కారణంగా హార్మూజ్ జల సంధిపై ఇరాన్ ఆంక్షలు విధించింది.ముడి చమురు సరఫరాను దాదాపు నిలిపివేసింది. కొన్ని మినహాయింపులు ఇచ్చామని చెబుతున్నా దాదాపు హార్మూజ్ జలసంధి నుంచి రవాణా పూర్తిగా నిలిచిపోయిందనే చెప్పాలి. ఇరాన్- ఇజ్రాయెల్, అమెరికా మధ్య తలెత్తిన ఉద్రిక్త పరిస్థితుల ముగింపుపై అనిశ్చితి నెలకొన్న క్రమంలో ఆయిల్ సంక్షోభం తీవ్ర రూపం దాల్చేలా కనిపిస్తోంది. ఈ కారణంగానే భారత ప్రభుత్వం గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను రూ.60 మేర పెంచింది. అలాగే ఎల్‌పీజీ బుకింగ్ పీరియడ్ 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. ఇదా క్రమంలో పెట్రోల్, డీజిల్ రేట్లను సైతం పెంచుతుందా? ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటనలో ప్రజలకు ఊరట కల్పించే విషయం ఉందా? అనేది తెలుసుకుందాం. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు 100 డాలర్లు దాటినా దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగలేదు. ముడి చమురు ధరలు రికార్డ్ స్థాయికి చేరినప్పటికీ ప్రభుత్వం వద్ద ధరలు పెంచాలనే ఆలోచన ప్రస్తుతానికి లేదని పెట్రోలియం శాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రపంచ ఆయిల్ మార్కెట్లను ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని తెలిపాయి. ఈ క్రమంలో పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ కీలక ప్రకటన చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. ‘ భౌగోళిక, రాజకీయ సవాళ్లు ఉన్న క్రమంలో భారతదేశ ఇంధన దిగుమతులపై చర్చించాము. దేశ ప్రజల సరసమైన, స్థిరమైన ఇంధన లభ్యతను నిర్ధారించడం, ప్రాధాన్యత ఇవ్వడం సహా సౌకర్యవంతంగా చేయడంపై ఆలోచిస్తున్నాం. దేశంలో ఇంధన కొరత లేదు. మన ఇంధన వినియోగదారులకు ఆందోళన చెందేందుకు ఎలాంటి కారణం లేదు’ అని కేంద్ర మంత్రి తెలిపారు.




# రూ.49,999కే ఎలక్ట్రిక్ స్కూటర్.. కంపెనీ కొత్త ఆఫర్.. నెల నెలా రూ.862 కడితే చాలు!



బడ్జెట్ ధరలో ఎలక్ట్రిక్ స్కూటర్ కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి మంచి అవకాశం. తక్కువ ధరకే ప్రీమియం స్కూటర్ సొంతం చేసుకోవచ్చు. రూ. 49,999కే టీవీఎస్ కంపెనీకి చెందిన ఆర్బిటర్ వీ1 స్కూటర్‌ను ఇంటికి తీసుకెళ్లవచ్చు. బ్యాటర్ యాజ్ ఏ సర్వీస్ ద్వారా ఈ ఆఫర్ అందిస్తోంది. నెలకు రూ. 862 నుంచి ప్లాన్స్ ప్రారంభమవుతున్నాయి. మరి ఈ ఆఫర్ పూర్తి వివరాలు ఈ కథనం ద్వారా తెలుసుకుందాం. ప్రముఖ టూ-వీలర్ తయారీ కంపెనీ టీవీఎస్ మోటార్ తన ఎలక్ట్రిక్ టూ-వీలర్ శ్రేణిని మరింత విస్తరించింది. గతేడాది ఆర్బిటర్ పేరుతో ఇ-స్కూటర్ లాంచే చేయగా ఈసారి ఆర్బిటర్ వీ1ను లాంచే చేసింది. ఈ వీ1 మోడల్ స్కూటర్ 1.8 కిలోవాట్ హవర్ బ్యాటరీ సామర్థ్యంతో వస్తోంది. అలాగే వీ2 స్కూటర్ 3.1 కిలోవాట్ హవర్ బ్యాటరీ సామర్థ్యంతో అందుబాటులోకి తీసుకొచ్చింది. వినియోగదారులకు ఈ స్కూటర్లను అందుబాటు ధరలో ఉంచేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ (దీఝుం) మోడల్‌ను లాంచ్ చేసింది. దీంతో దాదాపు సగం ధరకే ఎలక్ట్రిక్ స్కూటర్ సొంతం చేసుకునే వీలుంటుంది. టీవీఎస్ ఆర్బిటర్ వీ1 స్కూటర్‌ను కేవలం రూ.49 ,999 (ఢిల్లీ ఎక్స్ షోరూమ్ ధర) కే సొంతం చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. ఈ బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ ప్లాన్ ధర నెలకురూ.862 నుంచే మొదలవుతున్నట్లు తెలిపింది.
ఒక వేళ బ్యాటరీతో పాటు స్కూటర్ కొనుగోలు చేసేందుకు రూ.84,500 చెల్లించాల్సి ఉంటుంది. ఆర్బిటర్ వీ2 స్కూటర్ ధర రూ.99,900 నుంచి మొదలవుతున్నట్లు కంపెనీ తెలిపింది. అంటే బ్యాటరీని అద్దె ప్రాతిపదికన ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. నెల నెలా బ్యాటరీ కోసం రెంట్ చెల్లించాల్సి ఉంటుంది. టీవీఎస్ ఆర్బిటర్ వీ1 ఐడీసీ రేంజ్ 86 కిలోమీటర్లుగా ఉండగా ఆర్బిటర్ వీ2 మోడల్ స్కూటర్ 158 కిలో మీటర్ల రేంజ్ కలిగి ఉన్నట్లు కంపెనీ తెలిపింది. రెండు స్కూటర్లలోనూ 34 లీటర్ల అండర్ సీట్ స్టోరేజీ ఉంటుందని తెలిపింది. 5.5 అంగుళాల ఎల్‌సీడీ క్లస్టర్ డిస్‌ప్లే ఉంటుంది. టీవీఎస్ స్మార్ట్ కనెక్ట్ యాప్ ద్వారా బ్లూటూత్ కనెక్టివిటీ, కాల్, ఎస్ఎంఎస్ అలర్ట్స్, టర్న్ బై టర్న్ నావిగేషన్ వంటి సదుపాయలు ఈ స్కూటర్లలో లభిస్తాయి. అయితే, ఎలక్ట్రిక్ వాహనాలు అంటే బ్యాటరీనే కీలకం. వాహన ధరలో బ్యాటరీ ధరే ఎక్కువగా ఉంటుంది. దీంతో ఎలక్ట్రిక్ వాహనాలు కొనేందుకు కొందరు వెనకడుకు వేస్తుంటారు. కానీ, ఇకపై అలాంటి ఇబ్బందులు ఉండవు. బ్యాటరీ రెంటల్ విధానం ద్వారా తాము అనుకున్న ఎలక్ట్రిక్ వాహనాన్ని సొంతం చేసుకోవచ్చు. దీంతో బండి కోసం అధికంగా వెచ్చించాల్సిన అవసరం ఉండదు. తొలుత ఈ విధానాన్ని కార్ల కంపెనీలు అమలులోకి తీసుకొచ్చాయి. ఆ తర్వాత కంపెనీలూ అదే బాటలో పయనిస్తున్నాయి. ప్రీమియం వాహనాలను తక్కువ ధరకే పొందేందుకు ఇది సులవైన మార్గంగా చెబుతారు. సగం ధరకే స్కూటర్ తీసుకుని బ్యాటరీ కోసం నెల నెలా రెంటు చెల్లించాల్సి ఉంటుంది.

# ఏప్రిల్ 1 నుంచి కొత్త రూల్..




ఆర్థిక లావాదేవీలు నిర్వహించే వారికి పాన్ కార్డు ముఖ్యమైన డాక్యుమెంటు. ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరు పాన్ కార్డు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఏప్రిల్ 1, 2026 నుంచి పాన్ కార్డ్ అప్లికేషన్ రూల్స్ మారుతున్నాయి. ప్రస్తుతం కేవలం ఆధార్ తో పాన్ అప్లయ్ చేసే అవకాశం ఉండగా కొత్త నిబంధనల అమలు తర్వాత మరో డాక్యుమెంట్ కచ్చితంగా ఇవ్వాల్సి ఉంటుంది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం. ప్రస్తుత రోజుల్లో పాన్ కార్డు అనేది అత్యంత ముఖ్యమైన డాక్యుమెంట్లలో ఒకటిగా మారిపోయింది. బ్యాంకులో డబ్బులు వేయాలన్నా, తీయాలన్నా పాన్ నంబర్ అడుగుతున్నారు. ఐటీ రిటర్నులు ఫైల్ చేసేందుకు పాన్ కార్డు తప్పనిసరి. రూ. 50 వేలకు మంచి లావాదేవీలు నిర్వహించాలంటే పాన్ నంబర్ కావాలి. అందుకే ప్రస్తుతం చాలా మంది పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. మీరు కూడా కొత్తగా పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని అనుకుంటే మీకో అలర్ట్. వచ్చే ఏప్రిల్ 1, 2026 తేదీ నుంచి పాన్ కార్డు దరఖాస్తుకు సంబంధించి నిబంధనలు మారుతున్నాయి. ఆధార్ కార్డుతో పాటుగా పుట్టిన తేదీ ధ్రువీకరణ కోసం మరో డాక్యుమెంటును తప్పనిసరి చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం. ప్రస్తుతం కొత్తగా పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్ ఉంటే సరిపోతుంది. అయితే, ఇది మార్చి 31, 2026 తేదీ వరకే వర్తిస్తుంది. ఆ తర్వాతి రోజు నుంచి ఆధార్ తో పాటు డేట్ ఆఫ్ బర్త్ ధ్రువీకరణ కోసం మరో డాక్యుమెంట్ ఇవ్వాల్సి ఉంటుందని కామన్ సర్వీస్ సెంటర్ ఇ-గవర్నెన్స్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తెలిపింది. కేవలం ఆధార్‌తో పాన్ అప్లికేషన్ చేసేందుకు మార్చి 31 వరకే గడువు ఉందని తెలిపింది. ఏప్రిల్ 1, 2026 నుంచి అదనంగా డేట్ ఆఫ్ బర్త్ ప్రూఫ్ కావాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అలాగే పాన్ కార్డు అప్లికేషన్ పాత ఫారాలు ఇకపై యాక్సెప్ట్ చేయరని తెలిపింది. కొత్త ఫారాలను త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తారని, ఈ కొత్త మార్పులను ప్రజలు గమనించాలని సీఎస్‌సీ కోరింది.

**అదనపు డాక్యుమెంట్**

ఏప్రిల్ 1, 2026 నుంచి ఆధార్‌తో పాటు పుట్టిన తేదీ ధ్రువీకరణ కోసం ఏదైనా ఒక డాక్యుమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. ఈ జాబితాలో బర్త్ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ కార్డు, పదో తరగతి మార్కుల సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, మెజిస్ట్రేట్ వద్ద తీసుకున్న అఫిడవిట్, పాస్‌పోర్ట్ ఉన్నాయి. ఇవేమీ లేని సందర్భంలో ఇతర ఏదైనా ప్రభుత్వ డాక్యుమెంట్ అయినా ఉండాలని సీఎస్‌సీ ఇ- గవర్నెన్స్ తెలిపింది. ఏప్రిల్ 1 నుంచి పాన్ కార్డుపై పేరును తొలగిస్తున్నారని తెలిపింది. పాన్ కార్డును సూచించే పేరు ఆధార్ ప్రకారం ఉంటుందని స్పష్టం చేసింది. ఎవరైనా పాన్ కార్డు కావాలనుకుంటే మార్చి 31 వ తేదీలోపు అప్లై చేసుకోవాలని కోరింది.

# గడువు తప్పిందో..
# మూడు నుంచి ఏడేళ్లు జైలులోనే, జాగ్రత్త మరి




సాధారణంగా ఆదాయపు పన్ను రిటర్నులను (ఐటీఆర్) దాఖలు చేసే గడువు మార్చి 31, 2022 వరకు ఉంటుంది. 2021-22 అసెస్‌మెంట్ ఇయర్‌కు చెందిన తుది గడువు డిసెంబర్ 31, 2021 వరకు ఐటీ రిటర్నులను దాఖలు చేయని వారు, మార్చి 31 వరకు దాఖలు చేసుకోవచ్చు. అయితే తుది గడువు తర్వాత ఐటీఆర్ దాఖలు చేస్తే.. వారు ఏ ఆదాయపు పన్ను శ్లాబు కిందకు వస్తారో దాని బట్టి పెనాల్టీ ఉంటుంది. సాధారణంగా ఆదాయపు పన్ను రిటర్నులను (ఐటీఆర్) దాఖలు చేసే గడువు మార్చి 31, 2022 వరకు ఉంటుంది. 2021-22 అసెస్‌మెంట్ ఇయర్‌కు చెందిన తుది గడువు డిసెంబర్ 31, 2021 వరకు ఐటీ రిటర్నులను దాఖలు చేయని వారు, మార్చి 31 వరకు దాఖలు చేసుకోవచ్చు. అయితే తుది గడువు తర్వాత ఐటీఆర్ దాఖలు చేస్తే.. వారు ఏ ఆదాయపు పన్ను శ్లాబు కిందకు వస్తారో దాని బట్టి పెనాల్టీ ఉంటుంది. ట్యాక్స్ లయబులిటీ కిందకు వచ్చే వారు గడువు లోపల ఐటీఆర్ దాఖలు చేయడం మర్చిపోతే లేదా కావాలనే చేయకపోతే, ఆదాయపు పన్ను రిటర్నుల ఉల్లంఘన కింద జైలుకి వెళ్లే ప్రమాదం కూడా ఉంది. ఈ జైలు శిక్ష కనీసం మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు ఉండనుంది. ఆదాయపు పన్ను రిటర్నుల తుది గడువు గురించి ముంబైకి చెందిన పన్ను, పెట్టుబడుల నిపుణుడు బల్వంత్ జైన్ మాట్లాడుతూ..‘ఐటీఆర్‌లను తుది గడువు లోపల దాఖలు చేయకపోతే, ఆదాయపు పన్ను శాఖ పన్నుచెల్లింపుదారునిపై వాస్తవ పన్నులో 50 శాతం నుంచి 200 శాతం పెనాల్టీ వేస్తుంది. అంతేకాక పన్నును చెల్లించాలి, దానిపై వడ్డీ చెల్లించాలి. వీటికి అదనంగా కేంద్ర ప్రభుత్వం ఐటీఆర్ దాఖలు చేయనందుకు పన్ను చెల్లింపుదారునిపై ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఆదాయపు పన్ను చెల్లింపులున్నప్పటికీ, ఐటీఆర్‌లను తుది గడువు లోపల దాఖలు చేయకపోతే.. కనిష్టంగా మూడేళ్ల నుంచి గరిష్టంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది’ అన్నారు. అయితే పన్ను ఎగవేత రూ.10 వేలు దాటితేనే ఆదాయపు పన్ను శాఖ ట్యాక్స్‌పేయర్‌పై ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకుంటుందని బల్వంత్ పేర్కొన్నారు.తుది గడువు లోపలే ఆదాయపు పన్ను రిటర్నులను దాఖలు చేసుకుని, ఆలస్యపు ఫీజులను, పెనాల్టీలను, ప్రాసిక్యూషన్లను తప్పించుకోవాలని పన్ను నిపుణులు సూచిస్తున్నారు. డిసెంబర్ 31, 2021 లోపల ఐటీఆర్ దాఖలు చేసుకోలేకపోయిన పన్ను చెల్లింపుదారులు మార్చి 31, 2022 వరకు రిటర్నులను ఫైల్ చేసుకోవచ్చు. అయితే ప్రస్తుతం ఎలాంటి పెనాల్టీలు లేకుండా ఐటీఆర్‌లను ఫైల్ చేసుకునే గడువును సీబీడీటీ ఇటీవలే మార్చి 15, 2022 వరకు పొడిగించింది. కరోనా పరిస్థితులు, ఎలక్ట్రానిక్ ఫైలింగ్‌లో వస్తోన్న ఇబ్బందులతో సీబీడీటీ ఈ తుది గడువులను పొడిగించింది. అయితే రూ.లక్ష ట్యాక్స్ లయబులిటీ దాటిన వారికి ఈ ఊరట లేదు.

# ఎండాకాలం వచ్చేసింది! పాత కూలర్‌ను క్లీన్ చేసే చిట్కాలు

ఎండకాలం వచ్చిందంటే చాలు చాలా మంది కూలర్ల మీద ఆధారపడతారు. వాస్తవానికి ఏసీ కంటే కూలర్ అనే వాళ్లు ఉన్నారు. పైగా కూలర్ వినియోగించడం వల్ల విద్యుత్ ఛార్జీలు తగ్గుతాయి. అంతేకాకుండా కూలర్‌ను కావల్సిన చోటుకు మార్చుకోవచ్చు. అయితే ఇంట్లో ఉండే పాత కూలర్ సూపర్‌గా పనిచేయాలన్నా.. గాలి తాజాగా ఉండాలన్నా కూలర్‌ను బాగా శుభ్రం చేయడం మరిచిపోకూడదు. క్లీన్ చేయడం అంటే ఏదో పాతగుడ్డతోనో, లేదా కొద్దిగా నీళ్లు పోసి కడిగేయడం కాదు.. దానికొక ప్రాసెస్ ఉంది. మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ పగటిపూట పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ఉక్కపోత ఇబ్బందిపెడుతోంది. దీంతో చల్లదనం కోసం అందరూ పాత కూలర్ల దుమ్ముదులిపి వాడుకలోకి తీసుకువస్తుంటారు. ఎండల నుంచి ఉపశమనం పొందడానికి అందరూ ఎయిర్ కండీషనర్ (ఌాజ) కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. అలాగే ప్రతియేటా కొత్త కూలర్ కొనే పరిస్థితి కూడా ఉండదు. కాబట్టి చాలా ఇళ్లలో పాత కూలర్లను క్లీన్ చేసి వినియోగిస్తుంటారు. అయితే చాలా మంది పాత కూలర్లను సరిగా క్లీన్ చేయకుండానే వినియోగిస్తారు. ఇలా పాత కూలర్‌ను సరిగా క్లీన్ చేయకుండా వాడడం మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే వినియోగించకుండా ఎక్కువ రోజులు పక్కనబెట్టిన కూలర్లో పేరుకుపోయిన దుమ్ము, ధూళి కారణంగా పలు ఆరోగ్య సమస్యలు వచ్చే ఛాన్స్ ఉందని ఔనూ అధ్యయనం మరియు ౘఎవతీఱఓఋఅ ౠబఅస్త్ర ౘంంశీఏఱథ్‌ఱశీఅ అధ్యయనం హెచ్చరిస్తున్నాయి. ఈ క్రమంలో పాత కూలర్ క్లీనింగ్ కోసం పాటించాల్సిన సింపుల్ టిప్స్ తెలుసుకుందాం..

**మోటార్, ఫ్యాన్ బ్లేడ్స్ క్లీనింగ్**

కూలర్ శుభ్రం చేసే ముందు మూడు వైపులా ఉండే కూలింగ్ ప్యాడ్స్ను తీసేయాలి. వీటిని తీయడం ద్వారా లోపల సులభంగా క్లీనింగ్ చేయొచ్చు. ఆ తర్వాత కూలర్ లోపల ఉండే మోటార్, ఫ్యాన్ బ్లేడ్లకు ఉన్న దుమ్ము, ధూళిని ఒక క్లాత్తో శుభ్రంగా తుడవాలి. మరోసారి తడిగుడ్డతో ఫ్యాన్ రెక్కలు, ఇతర భాగాలపై ఉన్న దుమ్మును తుడవాలి. తర్వాత కొంచెం లూబ్రికేటింగ్ ఆయిల్ లేదా కొబ్బరి నూనెను స్క్రూలు ఉండే చోట వేయాఇల. దీనివల్ల తుప్పు పోయి ఫ్యాన్ సౌండ్ లేకుండా తిరుగుతుంది.

**వాటర్ ట్యాంక్ క్లీనింగ్**

కూలర్‌లోని ఫ్యాన్ బ్లేడ్లు, మోటార్ శుభ్రం చేసిన తర్వాత ముఖ్యంగా నీళ్లు నిల్వ ఉండే ట్యాంక్ ప్రాంతాన్ని శుభ్రం చేయాలి. ఎందుకంటే వాటర్ స్టోరేజ్ ప్లేస్‌లో నీళ్లు నిల్వ ఉండి పాచిపట్టి దుమ్ముతో కూడి ఉంటుంది. ట్యాంక్ క్లీన్ చేయకపోతే చెడు వాసన వచ్చే ఛాన్స్ ఉంటుంది. కాబట్టి వాటర్ ట్యాంక్ను నీట్గా కడగాలి. అయితే కూలర్ వాటర్ ట్యాంక్ శుభ్రం చేయడానికి గంట ముందు వెనిగర్ కలిపిన నీటిని కొద్దిగా స్ప్రే చేసి గంట తర్వాత శుభ్రం చేస్తే కూలర్ శుభ్రంగా ఉండటమే కాకుండా పాటు చెడు వాసన రాకుండా ఉంటుంది.

**కూలింగ్ ప్యాడ్స్ క్లీనింగ్**

కూలర్‌లోని మోటార్, వాటర్ ట్యాంక్, ఫ్యాన్ బ్లేడ్లు క్లీనింగ్ చేసిన తర్వాత కూలింగ్ ప్యాడ్స్ను కూడా శుభ్రం చేయాలి. కూలింగ్ ప్యాడ్లకు ఉన్న గడ్డి ఫ్రెష్గా ఉంటే దానిని అలాగే ఉంచొచ్చు. ఒకవేళ పాడయితే మాత్రం పాత గడ్డిని బయటకు తీసివేసి కొత్త గడ్డిని మంచిగా సెట్ చేసుకోవాలి. కొత్త గడ్డిని ఉపయోగించడం ద్వారా ఫ్రెష్ ఎయిర్తో పాటు కూలింగ్ బాగా వస్తుంది. ఆ తర్వాత కొత్త గడ్డి అమర్చిన ప్యాడ్స్ను కూలర్కు బిగించాలి. ఒకవేళ కూలర్ ప్యాడ్స్‌కు ఉన్న గడ్డి కాకుండా వేరే ప్యాడ్స్ ఉంటే వాటిని శుభ్రంగా క్లీన్ చేసుకోవాలి



# మెరిసేదంతా మంచి బెల్లం కాదు!



బెల్లం ఆరోగ్యానికి చాలా మంచిదని మన తాతల కాలం నాటి నుంచి వింటున్నాం. మనలో కూడా చాలా మంది చెక్కరకి బదులు బెల్లంని వాడుతుంటారు. కానీ ఏం లాభం.. మార్కెట్లో దళారులు స్వలాభం కోసం రసాయనాలు కలిపిన కల్తీ బెల్లం అమ్ముతుంటారు. ఈ కల్తీ బెల్లం తింటే లేనిపోని అనారోగ్యాలను కొని తెచుకున్నట్లే. మరి మీరు తింటున్న బెల్లం ఎంతవరకు సేఫ్? ఇంట్లోనే సులభంగా అసలైన బెల్లం, కల్తీ బెల్లం గుర్తించడం ఎలా? వంటి విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.. బెల్లం రుచికరమైనదే కాదు.. శరీరానికి ఎంతో ప్రయోజనకరమైనది కూడా. ముఖ్యంగా బెల్లంలో ఉండే ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, భాస్వరం వంటి శరీరానికి మేలు చేసే శక్తిని అందించే పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా శీతాకాలంలో బెల్లం తినడం వల్ల జలుబు తగ్గడమే కాకుండా శరీరం వెచ్చగా ఉంటుంది. ఇంకా హీమోగ్లోబిన్ పెంచి రక్తహీనతను తగ్గిస్తుంది.. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అన్నింటికి మించి భోజనం చేసిన తర్వాత రోజూ ఒక చిన్న ముక్క బెల్లం తినడం వల్ల జీర్ణక్రియ బాగా జరిగి కడుపు శుభ్రంగా ఉంటుంది. ఇక స్వీట్లు బాగా తినే వారికి చక్కెరకు బదులు మంచి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయం కూడా. ఇది కట్టుడు పళ్ల కంటే 300 రెట్లు ఉత్తమం! మరియు ధర చాలా చౌకగా ఉంటుంది

**బెల్లం నాణ్యతను సింపుల్‌గా తెలుసుకోవడానికి**

కల్తీ ఆహారం రాజ్యమేలుతున్న నేటి రోజుల్లో మెరిసేదంతా మంచి బెల్లం కాదు. సహజమైన రంగు, రుచి కలిగిన బెల్లం మాత్రమే శరీరానికి మంచి పోషకాలను అందిస్తుంది. అయితే మార్కెట్‌లో లభించే రకరకాల స్వీట్లు, ఆహార పదార్థాల్లో ఉపయోగించే బెల్లాన్ని చాక్‌పీస్ పౌడర్, బేకింగ్ సోడా వంటి పదార్థాలతో కల్తీ చేస్తున్నట్లు కూడా పలు రిపోర్టులు పేర్కొంటున్నాయి.



# సింపుల్ వాటర్ టెస్ట్

కొద్దిగా బెల్లం తీసుకుని ఒక గ్లాసు నీటిలో వేయండి. నిజమైన బెల్లం గ్లాస్ అడుగు భాగానికి చేరుకుంటుంది. అదే కల్తీ బెల్లం అయితే పైకి తేలుతుంది. ఎందుకంటే ఒరిజినల్ బెల్లం అధిక స్వచ్ఛత మరియు సాంద్రతను కలిగి ఉంటుంది. అలాగే నకిలీ బెల్లంలో కెమికల్స్, కృత్రిమ రంగులు కలపడం వల్ల దానిని తేలికగా చేస్తాయి. మరొక టెస్ట్ ఏమిటంటే.. సాధారణంగా బెల్లం ముదురు గోధుమ కలర్‌లో ఉంటుంది.

# కెమికల్స్ అవసరం లేకుండా బల్లులను తరిమికొట్టే చిట్కాలు



ప్రస్తుతం వంట ఇంట్లో చాలా మంది మహిళలను భయపెట్టే సమస్యల్లో బల్లుల సమస్య ప్రధానమైనది. బల్లులు కొందరికి చికాకు కలిగిస్తే.. మరికొందరికి ఎంతో భయాన్ని కలిగిస్తాయి. అందుకే ఇంట్లో బల్లులు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు. కానీ మనం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ బల్లలు ఇంట్లో పెరిగిపోతూ ఉంటాయి. అయితే బల్లులను ఇంటి నుంచి తరిమేయాలంటే ఏవేవో ప్రయోగాలు చేస్తుంటారు.. మార్కెట్‌లో ఉన్న కెమికల్ స్ప్రేలు ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఎలాంటి రసాయన స్ప్రేలు అవసరం లేకుండానే ఇంటి నుంచి బల్లులను తరిమికొట్టే మార్గాలేంటో తెలుసుకుందాం.. బొద్దింకలు, బల్లులు, చీమలు వంటి అవాంఛిత అతిథులు ఇంట్లో ఉంటే చిరాకుగా అనిపిస్తుంటుంది. ముఖ్యంగా బల్లులు తెగ చిరాకు పెడుతుంటాయి. ఎక్కడ పడితే అక్కడ పాకుతూ భలే ఇబ్బందిగా ఫీల్ అయ్యేలా చేస్తాయి. ముఖ్యంగా వంట గదిలో బాగా ఎక్కువగా తిరుగుతూ ఉంటాయి. వంట చేసే సమయంలో ఎక్కడ కింద పడతాయో, ఆహార పదార్థాలను కలుషితం చేస్తాయో అని మహిళలు కంగారు పడిపోతుంటారు. ఈ బల్లుల నుంచి శాశ్వతంగా విముక్తి పొందాలంటే జస్ట్ వెళ్లగొడితే సరిపోదు. అలాంటప్పుడు రసాయన కీటక సంహారాలపై ఆధారపడుతుంటారు. కానీ ఈ పురుగుల మందుల్లో ఉండే కెమికల్స్ మనుషులకు, ఇంట్లో ఉండే పెంపుడు జంతువులకు, పర్యావరణానికి హాని కలిగిస్తాయి. ముఖ్యంగా పురుగుల మందుల వల్ల శ్వాసకోశ సమస్యలు, చర్మ వ్యాధులు వంటి సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది. కాబట్టి కెమికల్స్ వాడకానికి ప్రత్యామ్నాయంగా కొన్ని రకాల ఇండోర్ ప్లాంట్స్ పెంచడం వల్ల బల్లులను సమర్థవంతంగా అరికట్టవచ్చని ×జీౖఌూ అధ్యయనం చెబుతోంది. మరి ఏయే మొక్కలు పెంచితే ఫలితం ఉంటుందో ఇప్పుడు తెలుసుకుందాం..

# ఏ రంగు బట్టలకు ఏ నగలు ధరిస్తే పర్ఫెక్ట్ మ్యాచింగో



దుస్తులకు తగిన నగలను ఎంచుకోవడం ఫ్యాషన్‌లో అత్యంత కీలకం. ముఖ్యంగా గోల్డ్, సిల్వర్ ఆభరణాల్ని ఏ రంగు దుస్తులతో ధరించాలో తెలియక చాలామంది గందరగోళానికి గురవుతుంటారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఏ రంగు బట్టలకు ఏ జ్యువెల్లరీ పర్ఫెక్ట్ మ్యాచింగ్ అవుతుందో ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్ నుపుర్ సింగ్ రాజ్‌పుత్ వివరించారు. మీ లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చే ఆ చిట్కాలేంటో ఇప్పుడు చుద్దాం. నగలు, దుస్తులు ఒకదానికొకటి సరిగ్గా మ్యాచ్ అయితేనే ఆ లుక్ పర్ఫెక్ట్‌గా ఉంటుంది. చాలామందికి డ్రెస్ కలర్స్‌కు తగినట్లుగా గోల్డ్ లేదా సిల్వర్ నగలను ఎంచుకోవడం ఒక సవాలుగా అనిపిస్తుంది. సరైన ఎంపిక చేసుకుంటే మీ అందం రెట్టింపు అవుతుంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ నుపుర్ సింగ్ రాజ్‌పుత్ ఈ కన్‌ఫ్యూజన్‌ను తొలగించారు. ఏ రంగు బట్టలకు ఏ జ్యువెల్లరీ పెట్టుకుంటే పర్ఫెక్ట్ మ్యాచింగ్ అవుతుందో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. బ్లాక్ కలర్ డ్రెస్సింగ్ స్టైల్‌లో ఎప్పుడూ ముందుంటుంది. బ్లాక్ డ్రెస్ ధరించినప్పుడు గోల్డ్ చాలా రిచ్ లుక్‌ని ఇస్తుంది. అదే సమయంలో సిల్వర్ జువెల్లరీ కూడా న్యూ స్టైల్‌ను ఇస్తాయి. కాబట్టి బ్లాక్ కాంబినేషన్‌కు గోల్డ్ లేదా సిల్వర్ రెండూ బాగుంటాయి. ఇక రెడ్ కలర్ డ్రెస్సుల విషయానికి వస్తే, గోల్డ్ నగలు వేసుకుంటే పర్ఫెక్ట్ లుక్‌ను ఇస్తాయి.

# మీ ఎత్తు ప్రకారం కుర్తీలు ఎలా సెలెక్ట్ చేసుకోవాలో తెలుసా?



కుర్తీలు అందరికీ నచ్చుతాయి.. కానీ అందరిపై ఒకేలా కనిపించవు. ఒకరిపై అద్భుతంగా ఉన్న కుర్తీ మీరు వేస్కుంటే పేలవంగా కనిపిస్తోందా? అయితే సమస్య డిజైన్‌లో లేదు.. మీ ఎత్తుకు, కుర్తీ పొడవుకు మధ్య ఉన్న పొంతనలో ఉంది. ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ అరణిసింధు మీ ఎత్తుని బట్టి కుర్తీ పొడవు ఎలా ఉండాలో అదిరిపోయే చిట్కాలను పంచుకున్నారు. పొట్టిగా ఉండేవారు పొడవుగా కనిపించాలన్నా, ఎత్తుగా ఉండేవారు మరింత గ్రేస్‌ఫుల్‌గా మెరవాలన్నా పాటించాల్సిన ఆ సీక్రెట్స్ ఇవే. మహిళలకు కుర్తీలంటే ఇష్టం. వారి ఫ్యాషన్‌లో ఇవి కూడా ఓ భాగం. కుర్తీల్ని రోజువారీ నుంచి పార్టీస్ వరకు వేసుకునేందుకు ఇష్టపడతారు మహిళలు. లైన్ కుర్తా, స్ట్రెయిట్ కుర్తా, అనార్కలీ కుర్తా ఇలా రకరకాల వెరైటీలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. కుర్తా వేసుకునేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే మీ లుక్ మొత్తం పాడైపోతుంది. ఎత్తును బట్టి కుర్తీ పొడువు సరిగ్గా ఉంటేనే లుక్ పర్ఫెక్ట్‌గా కనిపిస్తుంది. ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ అరణి సింధు ఎత్తు ప్రకారం కుర్తీలు ఎలా సెలెక్ట్ చేసుకోవాలో తెలిపారు. పొట్టిగా ఉన్నవారు పొడుగ్గా కనిపించాలన్నా, ఎత్తుగా ఉండేవారు మరింత స్టైలిష్ లుక్ పొందాలన్న ఎలాంటి చిట్కాలు పాటించాలో ఇప్పుడు చుద్దాం.

**ఎత్తు తక్కువగా ఉన్నవారి కోసం ప్రత్యేక చిట్కాలు**

సాధారణంగా 5.3 అడుగుల కంటే తక్కువ ఎత్తు ఉన్న అమ్మాయిలు కుర్తీల ఎంపికలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. చాలా పొడవుగా ఉండే కుర్తీలు వేసుకోవడం వల్ల వారు మరింత పొట్టిగా కనిపించే అవకాశం ఉందన్నారు. 5.3 కంటే తక్కువ హైట్ ఉన్నవాళ్లు మోకాళ్ల పైకి ఎండ్ అయ్యే షార్ట్ కుర్తీల్ని ఎంచుకోవాలని చెప్పారు దీనివల్ల వారు చాలా అందంగా కనిపిస్తారని అరణిసింధు వివరించారు. ఇలాంటి షార్ట్ కుర్తీలు ధరించడం వల్ల కాళ్లు పొడవుగా కనిపిస్తాయని.. దీని వల్ల బాడీ ప్రొపోర్షన్ సరిగ్గా ఉండి చూడటానికి చాలా ఎనర్జిటిక్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తారన్నారు. వీటిని జీన్స్ లేదా యాంకిల్ లెంగ్త్ లెగ్గింగ్స్‌తో జత చేస్తే లుక్ మరింత అద్భుతంగా ఉంటుందన్నారు.

**మీడియం హైట్ ఉన్నవారికి**

మీ ఎత్తు 5.4 అడుగుల నుంచి 5.7 అడుగుల మధ్యలో ఉంటే మీరు అదృష్టవంతులనే చెప్పాలన్నారు. ఈ ఎత్తు ఉన్నవారికి దాదాపు అన్ని రకాల దుస్తులు నప్పుతాయన్నారు. అయితే కుర్తీల విషయంలో ఒక చిన్న నియమం పాటిస్తే లుక్ మరింత బాగుంటుందని.. మీ డ్రెస్ పొడవు కరెక్టుగా మోకాళ్ల వద్ద ముగిసేలా చూసుకోవడం ఉత్తమం అని చెప్పారు. ఇలాంటి కుర్తీలు మీ ఎత్తును సరిగ్గా ప్రతిబింబిస్తాయన్నారు. మోకాళ్ల లెంగ్త్ కుర్తీలు మీ శరీర ఆకృతిని పొందికగా చూపిస్తాయన్నారు. ఆఫీసుకు లేదా చిన్నపాటి ఫంక్షన్లకు వెళ్లేటప్పుడు ఇలాంటి పొడవు ఉన్న కుర్తీలను ఎంచుకుంటే క్లాసీ లుక్ సొంతమవుతుందన్నారు.

**ఎత్తుగా ఉన్న అమ్మాయిల అందం పెరగాలంటే**

5.8 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న అమ్మాయిలు కుర్తీల విషయంలో కాస్త భిన్నంగా ఆలోచించాలన్నారు. వీరు చాలా పొట్టిగా ఉండే కుర్తీలు వేసుకుంటే అది అంతగా నప్పదన్నారు. ఎత్తుగా ఉన్నవారు మోకాళ్ల కిందకు ఉండే కుర్తీలను ఎంచుకోవడం మంచిదని చెప్పారు. ఇది వారి అందాన్ని మరింత ద్విగుణీకృతం చేస్తుందన్నారు. లాంగ్ కుర్తీలు లేదా అనార్కలీ మోడల్స్ వీరికి రాయల్ లుక్ ఇస్తాయ్యిన్నారు. ఎత్తును కవర్ చేస్తూనే ఒక రకమైన హుందాతనాన్ని ఇటువంటి డ్రెస్సులు ప్రసాదిస్తాయన్నారు. పలాజోలు లేదా లెహంగా తరహా బాటమ్స్‌తో వీటిని మ్యాచ్ చేస్తే పండగలు, పెళ్లిళ్లకు ప్రత్యేక ఆకర్షణగా నిలవచ్చు అని చెప్పారు.

**సరైన పొడవుతోనే ఆత్మవిశ్వాసం**

మనం వేసుకునే దుస్తులు మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయని అరణిసింధు తెలిపారు. ఎత్తుకు తగ్గట్టుగా కుర్తీ పొడవును సెట్ చేసుకోవడం వల్ల కలిగే ప్రధాన ప్రయోజనం ఆత్మవిశ్వాసమే అని చెప్పారు. తప్పుడు సైజు లేదా పొడవు ఉన్న కుర్తీలు వేసుకున్నప్పుడు మనకు తెలియకుండానే అసౌకర్యానికి గురవుతామని.. తాను సూచించిన ఈ లెంగ్త్ ఫార్ములాను పాటిస్తే షాపింగ్ చేసేటప్పుడు గందరగోళం ఉండదన్నారు.

EDITED, PUBLISHED AND OWNED BY N.MAHESHWAR REDDY PUBLISHED AT D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYD -500054, TELANGANA. PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYDERABAD - 500 054. RNI TELTEL 2024/90138, CONTACT NO : 8985586689, EMAIL : suryavelugutelanganadesk@gmail.com, Web SITE : www.suryavelugu.com